E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 17-02-2026 (వారం) మంగళవారం సంపుటి: 02 || సంచిక:47 || పేజీలు–6 www.ekaburu.com




విదేశీ మహిళపై అత్యాచారం » 2లో

## ఏఐ సమ్మిట్..
### భారత్ వేగవంతమైన వృద్ధికి నిదర్శనం ప్రధాని మోదీ



- భారత్ మండపంలో ఘనంగా ఏఐ ఇంపాక్ట్ సమిట్ ప్రారంభం
- ప్రపంచానికి భారత యువత ప్రతిభను చాటిన వేదిక
- "సర్వజన హితాయ" థీమ్‌తో గ్లోబల్ ఏఐ చర్చలు
- 45కుపైగా దేశాల ప్రతినిధుల పాల్గొనడం
- పటిష్ఠ భద్రత మధ్య అంతర్జాతీయ సదస్సు నిర్వహణ

ఈ కబురు : దేశ రాజధాని ఢిల్లీలోని భారత్ మండపంలో ఏఐ ఇంపాక్ట్ సమిట్ (AI Impact Summit 2026)ను నిర్వహిస్తుండడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో పాల్గొనాల్సిందిగా ప్రపంచ దేశాలకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచ దేశాలకు భారత యువత ప్రతిభ, సామర్థ్యం తెలుస్తాయని.. ప్రపంచ అభివృద్ధిలో భారత్ తన సహకారాన్ని మరింత పెంచుకునేందుకు ముందడుగు వేస్తోందన్నారు.

తరువాయి 2లో

## నగరంలో డ్రగ్స్ స్మగ్లర్ల
# నయా 'డెడ్ డ్రాప్' సప్లయ్

- కొండాపూర్ లో అంతరాష్ట్ర డ్రగ్స్ ముఠా అరెస్టు
- 32 గ్రాముల కొకైన్ స్వాధీనం డ్రగ్స్
- డ్రగ్స్ రవాణాలో ట్రావెల్స్ బస్సు డ్రైవర్, ర్యాపిడో డ్రైవర్
- 15 మంది వినియోగదారులకు నోటీసులు



ఈ-కబురు, శేరిలింగంపల్లి

"" ఆర్డర్లన్నీ ఆన్లైన్ వైఫైతో పనిచేసే వాట్సాప్ లోనే... పేమెంట్ ట్రాన్సాక్షన్ మొత్తం ఫోన్ల ద్వారానే... ఆర్డర్ చేసిన వారికి ఓ లొకేషన్ పిన్ వస్తుంది... ఏ కరెంటు పోల్ పక్కనో లేదా చెట్టు కిందనో రాయి కనిపిస్తుంది... రాయి తీస్తే కావాల్సిన ప్యాకెట్ చేతికి చేరుతుంది... ఎక్కడా మనిషికి మనిషి ఎదురు పడకుండా, చేతికి చేతి కలవకుండా వ్యాపారం జరిగిపోతుంది.. ఇది హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ స్మగ్లర్ల నయా "డెడ్ డ్రాప్ " సప్లయ్...""

నగరంలో డ్రగ్స్ భూతం రోజురోజుకు జడలు విప్పుతుంది. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ టీం, పోలీసులు పటిష్ట నిఘాతో కట్టడి చేస్తుండగా, మరోవైపు డ్రగ్స్ స్మగ్లర్లు సప్లయ్ లో కొత్త దారులు వెదుకుతున్నారు. తాజాగా నగరంలో డెడ్ డ్రాప్ డ్రగ్స్ సరఫరా బయటపడడం సంచలనంగా మారింది. కొండాపూర్ లో ఓ అంతరాష్ట్ర డ్రగ్స్ ముఠాను ఈగల్ టీం, గచ్చిబౌలి పోలీసులు దాడులు చేసి పట్టుకోగా, ఈ ముఠా డెడ్ డ్రాప్ తరహాలో డ్రగ్స్. సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ముగ్గురు సభ్యుల ఈ ముఠాను అదుపులోకి తీసుకున్న పోలీసులు వీరి వద్ద నుంచి 32 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వెస్ట్ గోదావరి జిల్లాకు చెందిన మురళీక్రిష్ణంరాజు (24) ఇంజనీరింగ్ మధ్యలోనే వదిలివేసి కొన్నాళ్లు పలు ప్రైవేటు ఉద్యోగాలు చేశాడు. ఏ ఉద్యోగంలోనూ తన జల్సాలకు సరిపడా డబ్బు దొరక్కపోవడం, మద్యం, డ్రగ్స్ అలవాటు కావడంతో ఖర్చులు పెరిగాయి. దీంతో డ్రగ్స్ బానిస నుంచి డ్రగ్స్ వ్యాపారి అవతారం ఎత్తాడు. మొదట మణికొండలో ఉండే ఓ వ్యక్తి నుంచి గ్రాము కొకైన్ 10వేలకు కొనుగోలు చేసి తనకు తెలిసిన వారికి 11వేలకు విక్రయించేవాడు. మణికొండ వ్యక్తి పోలీసులకు పట్టుబడడంతో బెంగళూరుకు, గోవాలలో ఉండే నైజీరియన్ల వద్ద నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసి నగరానికి తీసుకువస్తున్నాడు. అక్కడ గ్రాము 7వేల రూపాయలకు కొని, నగరానికి తీసుకువచ్చి 12 వేలకు విక్రయిస్తున్నాడు. డ్రగ్స్ స్మగ్లింగ్, సప్లయ్ కోసం

తరువాయి 2లో



2

### వచ్చేవారం మోదీ ఇజ్రాయెల్ పర్యటన

ఈ కబురు : ప్రధాని నరేంద్ర మోదీ త్వరలో ఇజ్రాయెల్‌ను సందర్శించనున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 25, 26వ తేదీల్లో ఆ దేశంలో పర్యటించనున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఓ సదస్సులో ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించారు.




3

శాంతి సామరస్యాల పరిరక్షణలో
### పీస్ కమిటీలదే కీలకపాత్ర

ఈ కబురు, హైదరాబాద్ :
"హైదరాబాద్ నగరం మత సామరస్యానికి నిలువెత్తు సాక్ష్యం. ఇక్కడి 'గంగా-జమునా తెహజీబ్' సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. నేరరహిత సమాజ స్థాపనలో పీస్ కమిటీ సభ్యులు పోలీసులకు, ప్రజలకు మధ్య బలమైన వారధిలా నిలవాలి" అని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ఐపీఎస్ పిలుపునిచ్చారు.




3

మాకు మున్సిపాలిటీలు తక్కువగా వచ్చినప్పటికీ
### ఓట్ల శాతం పెరిగింది

- 15 + మున్సిపాలిటీల్లో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా బీజేపీ అవతరించింది.
- బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచంద

ఈ కబురు, హైదరాబాద్ :
మాకు మున్సిపాలిటీలు తక్కువగా వచ్చినప్పటికీ ఓట్ల శాతం పెరిగిందని,15 + మున్సిపాలిటీల్లో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా బీజేపీ

మున్సిపల్ ఎన్నికల్లో..
## కాంగ్రెస్ గూండాగిరి

- భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



ఈ కబురు, హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గూండాగిరి చేసిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కిడ్నాప్‌లు, దాడులు, అక్రమ ఓట్లతో పదవులు పొందిందని ఆరోపించారు. రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతలకు ఇవాల్టి పరిణామాలే నిదర్శనమన్నారు. సోమవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.

.... 2లో



## నిధులు ఇవ్వకపోయితే వదిలేది లేదు

- మేయర్ గా ఓడించేందుకు మూడు పార్టీలు కలిసి కుట్రలు చేశాయి
- బిజేపి గెలిచిన మున్సిపాలిటీలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సమానంగా నిధులివ్వాలి
- బిజెపి కేంద్రమంత్రి బండి సంజయ్ హెచ్చరిక

.... 3లో

పెళ్లికి ముందే లైంగిక సంబంధంలోకి
## ఎలా వెళ్తారో?: సుప్రీంకోర్టు



- ఈ కబురు : పెళ్లికి ముందు శారీరక సంబంధాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఓ అత్యాచార కేసు విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం మాట్లాడుతూ.. ఓ బంధాన్ని ఏర్పరచుకునే విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

ఓ వ్యక్తి గురించి పూర్తి వివరాలు తెలియకుండా పెళ్లికి ముందే లైంగిక సంబంధంలోకి ఎలా వెళ్తారని ప్రశ్నించింది. వివాహానికి ముందు శారీరకంగా కలవాల్సిన అవసరమేముందని జస్టిస్ బీవీ నాగరత్న బాధితురాలిని ప్రశ్నించారు. యువతులు కానీ, యువకులు కానీ వివాహానికి ముందు ఎవరూ ఎవరినీ నమ్మకూడదంటూ హితవు పలికారు. "బహుశా మనం పాతకాలపు వాళ్లమే కావచ్చు... కానీ పెళ్లికి ముందు, ఒక అబ్బాయి, అమ్మాయి అపరిచితులు. వారి బంధం ఎంత బలంగా ఉన్నప్పటికీ.. వివాహానికి ముందు శారీరక సంబంధంలోకి ఎలా వెళ్లగలుగుతున్నారో అర్థం కావట్లేదు'' అని జస్టిస్ బీవీ నాగరత్న వ్యాఖ్యానించారు. ఈ కేసు తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు.

తరువాయి 2లో

## 84 చోట్ల కాంగ్రెస్.. 17 స్థానాల్లో బీఆర్ఎస్

- 11 మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్ల ఎన్నిక వాయిదా

ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా 105 మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ పూర్తయింది. మరో 11 మున్సిపాలిటీల్లో చైర్మన్ల ఎన్నిక వాయిదా పడింది. ఎన్నిక జరిగిన 105 మున్సిపాలిటీల్లో 84 కాంగ్రెస్ కైవసం చేసుకోగా.. 17 బీఆర్ఎస్ చేజిక్కించుకుంది. ఒక స్థానంలో భాజపా విజయం సాధించింది. మూడు చోట్ల స్వతంత్ర అభ్యర్థులు చైర్మన్లుగా ఎన్నికయ్యారు.

తరువాయి 2లో






చంద్రబాబుపై బిల్ గేట్స్
## ప్రశంసల జల్లు

- ఏపీకి ఒక్కరోజు అమరావతి పర్యటనకు వచ్చిన బిల్ గేట్స్
- ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి పరిపాలలో టెక్నాలజీ వినియోగాన్ని పరిశీలించిన గేట్స్
- డేటా లేక్ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలు అనుసంధానించిన తీరుకు గేట్స్, సీఎం కు ప్రశంసలు
- పన్నుల వసూల ప్రక్రియ బాగుందని ప్రశంసించిన గేట్స్

ఈ కబురు ; ఏపీలో ఒక్కరోజు పర్యటనకు వచ్చిన మైక్రోసాఫ్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించారు. ముందుగా సీఎం చంద్రబాబు నివాసానికి వెళ్లిన ఆయన,అనంతరం సచివాలయానికి చేరుకున్నారు. సీఎం చంద్రబాబు, మంత్రులు ఆయనకు స్వాగతం పలికారు. ఆ తర్వాత సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ (ఆర్టీజీఎస్)కు ఆయన్ను తీసుకెళ్లారు

తరువాయి 2లో

రైతులకు తెలంగాణ ప్రభుత్వం
# శుభవార్త

- వరి బోనస్ బకాయిలను విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం
- పెండింగ్‌లో ఉన్న రూ.514.36 కోట్ల బోనస్ నిధులు విడుదల
- ఇప్పటి వరకు రూ.1,939.58 కోట్ల బోనస్ నిధులు చెల్లింపు



ఈ కబురు, హైదరాబాద్;
రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్తను అందించింది. వరి బోనస్ బకాయి నిధులను విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న రూ.514.36 కోట్ల బోనస్ నిధులను విడుదల చేసింది. దీంతో 2.17 లక్షల రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

తరువాయి 2లో

## కాంగ్రెస్‌లో కొనసాగడంపై ఆలోచిస్తున్నా: జీవన్ రెడ్డి




ఈ కబురు, మేడిపల్లి: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీలో కొనసాగడంపై ఆలోచిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్ ఏంటో గోచరించడం లేదని, అవమానాలు ఇంకెంతకాలం భరించాలని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ వర్గాల మధ్య విభేదాలు తలెత్తిన సంగతి తెలిసిందే.

.... 3లో

బేగంపేటలో భారీ చోరీ..
## 30 తులాల బంగారం అపహరణ



ఈ కబురు, బేగంపేట:
బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీ చోరీ జరిగింది. ఓ వృద్ధురాలు శివరాత్రికి తన కూతురి ఇంటికి వెళ్లి వచ్చేలోపు ఇల్లు గుల్లయింది. ఈ ఘటన బేగంపేట సమీపంలోని శ్యామ్‌లాల్ వద్ద చోటు చేసుకుంది. చోరీకి పాల్పడిన దుండగులు 30 తులాల బంగారం, 2 కిలోల వెండి, రూ.50వేల నగదు అపహరించినట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ..... 3లో

జనగామ పురపాలికలో..
## పురపీఠం ఉత్కంఠ



ఈ కబురు, జనగామ: జనగామ పురపాలికలో రాజకీయాలు ఉత్కంఠ రేకెత్తిస్తున్నాయి. పురపీఠం ఎవరికి దక్కుతుందోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

తరువాయి 3లో

# నగరంలో డ్రగ్స్ స్మగ్లర్ల
# నయా 'డెడ్ డ్రాప్' సప్లయ్



పోలీసులకు పట్టుబడిన ముగ్గురు నిందితులు




నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ ప్యాకెట్లు

స్నేహితుడు భూపతిరాజు చిరంజీవి వర్మ(28)ను సైతం ఇందులో భాగం చేసి కస్టమర్లకు సరఫరా చేయించసాగాడు. క్రిష్ణంరాజుకు వరుసకు సోదరుడైన హేమంత్ రాజు(37) డ్రగ్స్ కు బానిసగా మారగా, ఇతన్ని సైతం సరఫరాలో భాగం చేసి దందా కొనసాగిస్తున్నాడు. కాగా కొండాపూర్ లోని వెంకటేశ్వర రెసిడెన్సీలో వీరు డ్రగ్స్ తో ఉన్నారని సమాచారం అందుకున్న ఈగల్ టీం, గచ్చిబౌలి పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 32 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకోవడంతో పాటు ముగ్గురికి పరీక్షలు చేయగా, డ్రగ్స్ పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు. వీరికి బెంగళూరు, గోవా నుంచి నగరానికి
డ్రగ్స్ రవాణా చేయడంలో ఓ ప్రైవేటు ట్రావెల్స్ డ్రైవర్, ఓ ర్యాపిడో డ్రైవర్ సహాయం చేస్తున్నట్లు గుర్తించారు. ఈ ముఠా వద్ద డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న 15 మంది కస్టమర్లను గుర్తించిన పోలీసులు వారికి నోటీసులు జారీ చేశారు.

డెడ్ డ్రాప్ సరఫరా...

ఈ ముఠా డ్రగ్స్ సరఫరా కోసం డెడ్ డ్రాప్ విధానాన్ని ఎంచుకొని తమ వివరాలు బయటపడకుండా జాగ్రత్తలు తీసుకున్నారని పోలీసులు తెలిపారు. కృష్ణంరాజు వైఫైతో పనిచేసే వాట్సాప్ ద్వారా కస్టమర్ల నుంచి డ్రగ్స్ ఆర్డర్ తీసుకొని, బెంగళూరులోని తన స్నేహితుల అకౌంట్లకు పేమెంట్ చేయించుకుంటాడు. అనంతరం వారు తిరిగి క్రిష్ణంరాజుకు ట్రాన్స్ ఫర్ చేస్తుంటారు, డబ్బు ముట్టిన వెంటనే డెడ్ డ్రాప్ విధానంలో డ్రగ్స్ సరఫరా చేస్తుంటారు. ఒక నిర్మాణుష్య ప్రదేశంలో డ్రగ్స్ ప్యాకెట్ పెట్టి, సదరు ప్రదేశం లోకేషన్, ఆనవాళ్లను కస్టమర్ కు చేరవేస్తారు. వారిని అక్కడికి వెళ్లి డ్రగ్స్ తీసుకోమని సూచిస్తారు. ఆన్ లైన్ ఆర్డర్, డెడ్ డ్రాప్ సప్లయ్ తో మనిషికి, మనిషికి ఎటువంటి సంబంధం లేకుండా డ్రగ్స్ సరఫరా జరిగిపోతుంది. కాగా నిందితులు ఉపయోగించిన డేడ్ డ్రాప్ విధానంతోనే పోలీసులు ఈ ముఠాను వలపన్ని పట్టుకోవడం విశేషం.



డెడ్ డ్రాప్ విధానంతో డ్రగ్స్ సరఫరా

## 84 చోట్ల కాంగ్రెస్..
## 17 స్థానాల్లో బీఆర్ఎస్



116 మున్సిపాలిటీలకు ఈ నెల 11న ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఫలితాల సమయానికి 90 స్థానాల్లో వివిధ పార్టీలు స్పష్టమైన మెజార్టీ కనబరచగా.. 36 స్థానాల్లో హంగ్ పరిస్థితి ఏర్పడింది. కాగా, వివిధ పార్టీల మధ్య పొత్తులు, స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో కొన్ని మున్సిపాలిటీల్లో ఛైర్ పర్సన్లు ఎన్నికయ్యారు.

**——11 మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్ల ఎన్నిక వాయిదా**

వివిధ కారణాల వల్ల 11 మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్ల ఎన్నిక వాయిదా పడింది. ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, క్యాతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్, జనగామ, తొర్రూర్ మున్సిపాలిటీలో ఎన్నిక వాయిదా పడినట్లు అధికారులు వెల్లడించారు. తిరిగి ఎప్పుడు ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తారన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

## చంద్రబాబుపై బిల్ గేట్స్
## ప్రశంసల జల్లు



ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని బిల్ గేట్స్ పరిశీలించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని వేగంగా అందిస్తున్న తీరు, ఫలితాలను గేట్స్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. డేటాలేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, సంజీవని ప్రాజెక్టు, రాజధాని అమరావతి ప్రాజెక్టుల గురించి బిల్ గేట్స్ తెలుసుకున్నారు.ఆర్టీజీఎస్‌లోని డిస్ ప్లే వాల్స్‌పై ప్రజంటేషన్లను పరిశీలించారు. డేటా లేక్ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలను అనుసంధానించామని సీఎం ఆయనకు వెల్లడించారు. డేటా లేక్, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని సులభతరం చేయడం బాగుందని గేట్స్ చంద్రబాబును ప్రశంసించారు. అవేర్ 2.0 ద్వారా రియల్ టైమ్‌లో సమాచారాన్ని సేకరించి, వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్టు సీఎం తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పాలసీల అమలుపై ప్రజాభిప్రాయం సేకరిస్తున్న తీరును గేట్స్ పరిశీలించారు.కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ద్వారా జీఎస్డీపీ పెరుగుదలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నట్టు ఆయనకు సీఎం వివరించారు. ప్రాపర్టీ రికార్డుల భద్రతకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని బిల్ గేట్స్ ప్రశ్నించగా,బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో ల్యాండ్ రికార్డులు భద్రపరుస్తున్నామని వివరించారు. క్యూఆర్ కోడ్ వంటి విధానాలతో భూ రికార్డులు పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే పన్నుల వసూలు ప్రక్రియ అద్భుతంగా ఉందని గేట్స్ ప్రశంసించారు. జీఎస్టీ విధానంతో దేశంలో పన్నుల వసూళ్లు కూడా గణనీయంగా పెరిగిందని సీఎం చంద్రబాబు తెలిపారు. తమ గేట్స్ ఫౌండేషన్ సహకారంతో చిత్తూరు జిల్లాలో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు అమలు, బీపీ, డయాబెటీస్ పరీక్షల వివరాలను ఎలా నమోదు చేస్తున్నారని గేట్స్ అడిగారు. అనంతరం కుప్పంలో అమలు చేసిన సంజీవని ప్రాజెక్టు బాగుందని గేట్స్ ప్రశంసించారు.ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను అనుసరించి వారి లైఫ్ స్టైల్, ఆహారం తదితర అంశాల్లో సలహాలు ఇస్తున్నామని అధికారులు ఆయనకు వివరించారు. అలాగే ఏఐ వినియోగంతో ప్రజారోగ్య సేవలను మరింత మెరుగుపరిచేలా చూస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. దీంతో గ్రేట్ అంటూ బిల్ గేట్స్ కితాబిచ్చారు. బయో డిజైన్ ద్వారా వైద్య సేవలు అందించే విధానాలను బిల్ గేట్స్ అడిగి తెలుసుకున్నారు. డయాగ్నోస్టిక్ సేవలు తక్కువ వ్యయానికే అందితే పేదలకు వెసులుబాటు ఉంటుందని గేట్స్ తెలిపారు. అనంతరం అమరావతి నిర్మాణ వివరాలు తెలుసుకున్న బిల్ గేట్స్,రాజధానిలో 30 శాతం గ్రీన్ అండ్ బ్లూ ప్రణాళిక బాగుందని కితాబిచ్చారు.

## ఏఐ సమ్మిట్..
## భారత్ వేగవంతమైన వృద్ధికి నిదర్శనం
### ప్రధాని మోదీ



సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత్ వేగంగా వృద్ధి చెందుతుందనడానికి ఈ కార్యక్రమం నిదర్శనమన్నారు. గ్లోబల్ సౌత్‌లో నిర్వహిస్తున్న ఈ మొదటి ప్రధాన అంతర్జాతీయ ఏఐ (AI) సమిట్ మన దేశంలో జరుగుతుండడం గర్వకారణమన్నారు. ''సర్వజన హితాయ, సర్వజన సుఖాయ'' (అందరికీ సంక్షేమం, అందరికీ ఆనందం) అనే ఈ సదస్సు థీమ్‌పై మోదీ మాట్లాడుతూ.. ప్రపంచదేశాల పురోగతి కోసం కృత్రిమ మేధస్సును ఉపయోగించుకోవడంలో మన ఉమ్మడి నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. ఈ సమిట్ వల్ల డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తిమంతమైన స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందన్నారు. ఇప్పటికే ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పాలన వంటి అనేక రంగాల్లో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నేటినుంచి 20వ తేదీ వరకు దిల్లీలో జరగనున్న ఈ సదస్సుకు 45కు పైగా దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు. ఆయా దేశాలు తమ ఏఐ అజెండాలను నిర్వచించుకోనున్నాయి. మన ప్రతిభను ప్రదర్శించడం, డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలను విస్తరించడం, విస్తృతం అవుతున్న అంకుర సంస్థల ఎకోసిస్టమ్‌ను ప్రపంచానికి పరిచయం చేయడం ఈ సదస్సు ఉద్దేశం.

**—— 10వేలమంది పోలీసులు.. యాంటీ డ్రోన్ వ్యవస్థలు.. 'ఏఐ సదస్సు'కు పటిష్ఠ భద్రత**

దేశ రాజధాని దిల్లీ వేదికగా 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్' ప్రారంభమైంది. నేటి నుంచి 20వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు బ్రెజిల్, ఫ్రాన్స్, స్పెయిన్, స్విట్జర్లాండ్, యూఏఈ తదితర దేశాల నేతలు హాజరుకానున్నారు. 45కుపైగా దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేశారు. సదస్సు వేదిక 'భారత్ మండపాన్ని' కృత్రిమ మేధ (AI) ఆధారిత నిఘా, ఆధునిక రక్షణ వ్యవస్థలతో శత్రుదుర్భేద్యంగా మార్చారు.

వైమానిక దాడులను అడ్డుకునేందుకు భారత్ మండపం కాంప్లెక్స్‌లో అయిదు యాంటీ డ్రోన్ వ్యవస్థలు, నాలుగు ఎయిర్ డిఫెన్స్ గన్‌లను మోహరించారు. ఉగ్రదాడుల వంటి ఘటనలను తిప్పికొట్టేందుకు ఎన్ఎస్‌జీ సహా పలు భద్రతా సంస్థలను రంగంలోకి దించారు. మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీ (PM Modi), అంతర్జాతీయ వీవీఐపీల భద్రతా బాధ్యతలను ఎస్పీజీకి అప్పగించారు. సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, ఐటీబీపీ బృందాలు భారత మండపం పరిసరాల్లో భద్రతను పర్యవేక్షిస్తున్నాయి. దిల్లీ వీధుల్లో 10 వేల మందికిపైగా పోలీసులను మోహరించారు. సదస్సు జరుగుతున్న ప్రాంతాన్ని 10 జోన్‌లు, 22 సెక్టార్లుగా విభజించారు. వీటిని కమాండ్, కంట్రోల్, కమ్యూనికేషన్, ఇంటెలిజెన్స్ సిస్టమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఏఐ కెమెరాల ద్వారా రద్దీ నిర్వహణ, అనుమానాస్పద కదలికలు, గుర్తుతెలియని వస్తువుల విశ్లేషణ చేపడుతున్నారు. డిజిటల్ పాసులు, క్యూఆర్ కోడ్‌ల ద్వారానే అతిథులను లోపలికి అనుమతిస్తున్నారు. వీవీఐపీల రాకపోకల సమయంలో ట్రాఫిక్, సెక్యూరిటీ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విదేశీ అతిథుల కోసం కేంద్రం బుల్లెట్ ప్రూఫ్ కార్లను సమకూర్చింది. వారు బస చేస్తున్న హోటళ్లలో రెండు వారాల నుంచే భద్రతా ప్రొటోకాల్‌లు అమలులో ఉన్నాయి.

## వచ్చేవారం మోదీ
## ఇజ్రాయెల్ పర్యటన



వచ్చే వారం పార్లమెంటు ను ఉద్దేశించి మోదీ ప్రసంగించనున్నట్లు తెలిపారు. ''భారత్ ఇజ్రాయెల్ ల మధ్య అద్భుతమైన మైత్రి ఉంది. ఇరుదేశాల మధ్య పరస్పర సహకారంపై మేం చర్చించనున్నాం. భారత్ చిన్న దేశం కాదు. 140 కోట్లమంది ప్రజలు ఉన్నారు. చాలా శక్తిమంతమైన దేశం'' అని నెతన్యాహు వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్‌లోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా మోదీ కి ఉన్న పాపులారిటీ దృష్ట్యా ఆయన పర్యటన ప్రభావవంతంగా ఉంటుందని సంబంధిత వర్గాలు 'పీటీఐ' వార్తాసంస్థకు తెలిపాయి. ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటనపై ఇప్పటివరకు అధికారికంగా ప్రకటనేదీ వెలువడలేదు. ఒకవేళ ఇది ఖరారైతే.. ఆ దేశంలో ప్రధాని మోదీకి ఇది రెండో పర్యటన అవుతుంది. గాజా యుద్ధం అనంతరం ఇదే తొలి సందర్శన. గతంలో 2017 జులైలో పర్యటించారు.

## రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త



వరి రైతులకు సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ బోనస్ ద్వారా 2025 26లో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన రెండు లక్షల మందికి పైగా రైతులకు ప్రయోజనం కలగనుంది. వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చడం, సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం వరి క్వింటాల్‌పై రూ.500 బోనస్ ఇస్తున్న విషయం తెలిసిందే. కనీస మద్దతు ధరకు ఈ రూ.500 అదనం. బకాయిల చెల్లింపుతో రైతులకు ఆర్థిక ఉపశమనం లభిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

## పెళ్లికి ముందే లైంగిక సంబంధంలోకి ఎలా వెళ్తారో?: సుప్రీంకోర్టు



-కేసు ఏమిటంటే?

ప్రాసిక్యూటర్ తెలిపిన వివరాల ప్రకారం.. 2022లో ఓ మ్యాట్రిమొని ద్వారా ఓ యువతికి ఓ యువకుడు పరిచయం అయ్యాడు. అనంతరం పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. కొంతకాలం తర్వాత అతడికి అప్పటికే రెండు వివాహాలు అయినట్లు తెలుసుకున్న యువతి ప్రశ్నించగా ప్రైవేటు వీడియోలు బయట పెడతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా..అత్యాచారం కేసు నమోదు చేశారు. ఈ కేసులో బెయిల్ కోరుతూ నిందితుడు వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనంపై వ్యాఖ్యలు చేసింది.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గూండాగిరి; కెటిఆర్



''ఎక్స్ అఫీషియో ఓట్ల పేరుతో దొంగ ఓట్లను నమోదు చేశారు. కాంగ్రెస్ తొత్తులుగా మారిన పోలీసులపై డీజీపీ చర్యలు తీసుకోవాలి. కాంగ్రెస్ నేతల ఒత్తిడి మేరకు ఛైర్‌పర్సన్ల ఎన్నికను కొన్ని చోట్ల వాయిదా వేశారు. సంబంధిత అధికారులపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి'' అని కేటీఆర్ డిమాండ్ చేశారు. మరోవైపు హంగ్ వచ్చిన మున్సిపాలిటీలపై భారాస దృష్టి సారించింది. 8 పట్టణాలకు సీనియర్ నేతలను ఇన్‌ఛార్జిలుగా నియమించింది.

## విదేశీ మహిళపై
## అత్యాచారం




**. ముగ్గురు నిందితులకు న్యాయస్థానం మరణశిక్ష**

**ఈ కబురు, బెంగళూరు ;**

విదేశీ మహిళపై అత్యాచారం కేసులో కర్ణాటక కోర్టు కీలక తీర్పు వెల్లడించింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో ముగ్గురు నిందితులకు న్యాయస్థానం మరణశిక్ష విధించింది. ప్రపంచ వారసత్వ ప్రదేశమైన హంపి సమీపంలో గతేడాది మార్చి 6న జరిగిన ఇజ్రాయెల్ మహిళపై అత్యాచారం, అమెరికన్ పర్యాటకుడి హత్య కేసులో ముగ్గురు దోషులకు కర్ణాటకలోని గంగావతి కోర్టు మరణశిక్ష విధిస్తూ తీర్పు ప్రకటించింది. ఫిబ్రవరి 6న, మొదటి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు.. మల్లేష్ అలియాస్ హండిమాల్, సాయి, శరణప్ప అనే ముగ్గురు నిందితులను దోషులుగా నిర్ధారించింది. ఫిబ్రవరి 16న శిక్షను ప్రకటిస్తూ.. న్యాయమూర్తి సదానంద నాగప్ప నాయక్ ముగ్గురు దోషులకు మరణశిక్ష విధించారు.

# డబ్బు కోసం బిటెక్ విద్యార్థుల చోరీ బాట...

**● హెచ్సీయులో లాప్ టాప్ లు చోరీ చేసిన ముగ్గురు అరెస్టు**

ఈకబురు, శేరిలింగంపల్లి : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సంచలనం సృష్టించిన లాప్ టాప్ ల చోరీ కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఓ బయటి వ్యక్తితో కలిసి యూనివర్సిటీకి చెందిన ఇద్దరు విద్యార్థులు ఈ లాప్ టాప్ లను చోరీ చేయగా, ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. దాదాపు 30 లక్షల విలువైన 60 ల్యాప్ టాప్ లను నిందితుల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో బిటెక్ రెండవ సంవత్సరం చదువుతున్న సాయిచరణ్(19), అశ్విన్ రావు(19)లు టిఎన్జిఓ కాలనీలోని నెక్స్ట జెన్ హాస్టల్ లో ఉంటున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా నుంచి వచ్చి గతంలో ఇదే హాస్టల్లో ఉండివెళ్లిన రేగుల చంద్రశేఖర్(30) వీరికి స్నేహితుడయ్యాడు. జల్సాలకు అలవాటు పడిన వీరికి అప్పులు కాగా, అప్పులు తీర్చేందుకు దొంగతనం చేయాలని పథకం వేశారు. హెచ్సియులోని సిఆర్ రావు ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో గల ఓ తరగతి గదిలో ఫిబ్రవరి 6వ తేదీన 60 కొత్త ల్యాప్టాప్లను తెచ్చి విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న సాయిచరణ్, అశ్విన్ రావులు చంద్రశేఖర్ కు చెప్పారు. ముగ్గురు కలిసి సదరు ల్యాప్టాప్లను చోరే చేసి బెంగళూరు తరలించి, అక్కడ విక్రయించి డబ్బు చేసుకోవాలని పథకం వేశారు. ఇందులో భాగంగా ఓ ట్రావెల్స్ నుంచి (టిఎస్15 ఎఫ్7697) టోయోటా గ్లాంజా ఎర్రరంగు కారును అద్దెకు తీసుకున్నారు. ఫిబ్రవరి 8వ తేదీన సదరు కారును వర్సిటీ లోపలికి తీసుకువచ్చి అర్ధరాత్రి సమయంలో సిఆర్ రావు ఇనిస్టిట్యూట్ కిటికీ గ్రిల్స్ తొలగించి తరగతి గదిలోకి ప్రవేశించారు. అనంతరం 60 ల్యాప్టాప్లను కారులోకి ఎక్కించి యూనివర్సిటీ ప్రధాన గేటు ద్వారా బయటకు వచ్చారు. అక్కడి నుండి నేరుగా చంద్రశేఖర్ ప్రస్తుతం ఉంటున్న కూకట్ పల్లిలోని సెవెన్ హిల్స్ అపార్టుమెంటుకు వెళ్లి ల్యాప్టాప్లను ఓ బెలానో కారు (టిజీ11 సి3963)లోకి మార్చి పార్కింగ్ లోనే ఉంచారు. చోరీ కోసం ట్రావెల్స్ నుంచి తెచ్చిన గ్లాంజా కారును తిరిగి ఇచ్చేశారు. ల్యాప్టాప్లను బెంగళూరుకు తరలించి అక్కడ విక్రయించాలని ఆలోచించగా, అప్పటికే వర్సిటీ అధికారుల పిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకోవడం సంచలనంగా మారింది. దీంతో సదరు కారును పార్కింగ్ లోనే ఉంచారు. కాగా విచారణ చేపట్టిన పోలీసులు సిసి కెమెరాల ఆధారంగా గ్లాంజా కారు నెంబరును గుర్తించి కూపీ లాగడంతో మొత్తం తతంగం బయటపడింది. సాయిచరణ్, అశ్విన్ రావులతో పాటు చంద్రశేఖర్ ను టిఎన్జీఓ కాలనీలోని హాస్టల్లో అదుపులోకి తీసుకున్న పోలీసులు వారు ఇచ్చిన మాచారంతో కారులో ఉన్న ల్యాప్టాప్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న 60 లాప్ టాప్ ల విలువ దాదాపు 30లక్షల వరకు ఉంటుందని తెలుస్తుంది. ఈ మేరకు నిందితుల వద్ద నుంచి లాప్ టాప్ లు, చోరికి ఉపయోగించిన రెండు కార్లు, సెల్ఫోన్లను స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.



నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న లాప్ టాప్ లతో గచ్చిబౌలి పోలీసులు

# నిధులు ఇవ్వకపోయితే వదిలేది లేదు



**ఈ కబురు, హైదరాబాద్ :**

ఎన్నికల వరకే రాజకీయాలు.. ఆ తర్వాత రాజకీయాలు పక్కన పెట్టాలని బిజెపి కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. కరీంనగర్ ను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతోనే ఎన్నికల బరిలోకి దిగామని అన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని, ప్రజా తీర్పును పక్కన బెట్టి కాంగ్రెస్ కుట్రలు చేసిందని విమర్శించారు. బిజెపి బలపడితే కాంగ్రెస్ భయపడుతోందని అన్నారు. కరీంనగర్ గడ్డపై బిజెపి జెండా ఎగురవేశామని, 80 ఏళ్ల కల నెరవేరిందని బండి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఎన్నికల వెనుక ఎన్నో కుట్రలు కుతంత్రాలు జరిగాయని, ఎన్ని చేసినా ప్రజలు ధర్మం వైపే నిలబడ్డారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీకి మాటిచ్చా.. కరీనంనగర్ లో గెలిపించానని, కరీంనగర్ అభివృద్ధికి కేంద్రమంత్రులు, రాష్ట్రమంత్రులనూ కలుస్తామని అన్నారు. బిజెపి మేయర్ ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోయినా వదిలేది లేదని హెచ్చరించారు. బిఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలన్నీ కలిసి సాధించింది ఏంటి? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో తాము గెలిచినా.. మేయర్ గా ఓడించేందుకు మూడు పార్టీలు కలిసి కుట్రలు కలిశాయని బండిసంజయ్ పేర్కొన్నారు.

మాకు మున్సిపాలిటీలు తక్కువగా వచ్చినప్పటికీ

# ఓట్ల శాతం పెరిగింది



అవతరించిందని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తెలిపారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కరీంనగర్ కార్పొరేషన్, నారాయణపేట, భైంసా మున్సిపాలిటీల్లో బీజేపీ చైర్ పర్సన్ పీఠం పదవి దక్కించుకుంది. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.భైంసాలో గత కాంగ్రెస్ హయాం నుంచే.. బీజేపీ కార్యకర్తలు, హిందూ ధార్మిక సంస్థల సభ్యులపై ఎన్నో కేసులు పెట్టారు.. అడ్వకేట్ గా నేను ఎంతో మంది బెయిల్ ఇప్పించిన. ఇంతకాలం బీజేపీ మజ్లిస్, కాంగ్రెస్ మజ్లిస్ కలిసి.. భైంసాలో బీజేపీని రానివ్వలేదు.భైంసాలో ఎంఐఎం పార్టీ ఎన్నో ఆగడాలకు పాల్పడింది.మాకు మున్సిపాలిటీలు తక్కువగా వచ్చినప్పటికీ ఓట్ల శాతం పెరిగింది.చాలా మున్సిపాలిటీల్లో బీజేపీ సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఆధిక్యం చూపింది.ఛైర్మన్, వైస్చైర్మన్ ఎన్నికల్లో బీజేపీ కీలక పాత్ర పోషించింది.గతానికి భిన్నంగా బీజేపీకి ఓట్లు,సీట్లు పెరిగాయి. 15 + మున్సిపాలిటీల్లో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా బీజేపీ అవతరించింది.ఖమ్మం, వరంగల్, కొత్తగూడం, పరకాల లాంటి చోట్ల బీజేపీ సత్తా చాటింది.చాలా చోట్ల మా ఓటు బేస్ పెరిగింది. బీఆర్ఎస్ పార్టీకి గతం కంటే 14 శాతం ఓట్లు తగ్గాయి.బీఆర్ఎస్ ఇప్పుడు కేవలం 13 మున్సిపాలిటీలకు పరిమితమైంది.అధికారంలో ఉన్న అధికార పార్టీకి కూడా మెజార్టీ సీట్లు రాలేదు. చరిత్రలో మొట్టమొదటిసారిగా కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుంది.నిజామాబాద్ లో 28 చోట్ల బీజేపీ గెలిచి.. సింగిల్ లార్జెస్ట్ పార్టీగా బీజేపీ అవతరించింది.మజ్లిస్ పార్టీ ఓటు పర్సంటేజీ.. తగ్గినా.. వారి ప్రభావం రాష్ట్రంలో పెరుగుతున్నది. నిర్మల్ లో ఒక వార్డులో ఎప్పుడూ లేనంతగా మైనార్టీ ఓట్లు పెరిగాయి. దీని మీద మాకు అనుమానం ఉన్నది. దీనిపై ఫిర్యాదు చేశాం.20 శాతం నుంచి 57 శాతానికి మైనార్టీ ఓట్లు ఎలా పెరిగాయి? బీజేపీని అడ్డుకునేందుకు కుట్రలు జరుగుతున్నాయి.ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్, కమ్యూనిస్టులు కలిసి.. బీజేపీకి మేయర్, చైర్ పర్సన్ పదవులు రానివ్వకుండా కుట్ర చేశారు.ఈ మూడు పార్టీల మధ్య ఉన్న సంబంధం ఏంటో చెప్పాలి. ఎర్రజెండా ఎక్కడా లేకున్నా.. తెలంగాణలో కాంగ్రెస్ ఎర్రజెండాకు అధికారం వచ్చేలా చేస్తున్నది.బీజేపీ ఎప్పుడూ అభివృద్ధి కోసమే పనిచేస్తుంది.. ఇప్పుడు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆ అభివృద్ధి కనిపిస్తున్నది.ఏప్రిల్ లో ఎస్ఐఆర్ రాబోతున్నది. హైదరాబాద్ లో దొంగ ఓట్లు, బయటి ఓట్లు తీసేయబోతున్నం. బీఎల్వోలు, ఆఫీసర్లు అప్రమత్తంగా ఉండాలి. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. ఇంటి ఓనర్లకు తెలియకుండానే ఒక్కో ఇంటిపై 60 ఓట్ల వరకు నమోదు చేస్తున్నారు.మాకు ఓటు వేసిన తెలంగాణ ప్రజలందరికీ ధన్యవాదాలు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ తప్పకుండా అధికారంలోకి వస్తాం.

శాంతి సామరస్యాల పరిరక్షణలో

# పీస్ కమిటీలదే కీలకపాత్ర




**నేర రహిత సమాజ స్థాపనకు పోలీసులకు వారధిగా నిలవండి**

**నగర పోలీస్ కమిషనర్ వీసీ.సజ్జనర్ పిలుపు**

ఈ కబురు, హైదరాబాద్ :

"హైదరాబాద్ నగరం మత సామరస్యానికి నిలువెత్తు సాక్ష్యం. ఇక్కడి 'గంగాజమునా తెహజీబ్' సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. నేరరహిత సమాజ స్థాపనలో పీస్ కమిటీ సభ్యులు పోలీసులకు, ప్రజలకు మధ్య బలమైన వారధిలా నిలవాలి" అని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ఐపీఎస్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఆడిటోరియంలో సోమవారం సెంట్రల్ పీస్, వెల్ఫేర్ కమిటీ సమన్వయ సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీ సీపీ సజ్జనర్, సభ్యులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో 1984లో ఏర్పాటైన పీస్ కమిటీలు దశాబ్దాలుగా శాంతిభద్రతల పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నాయని గుర్తుచేశారు. నేడు హైదరాబాద్ ప్రపంచ పటంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందంటే, అందులో పీస్ కమిటీలతో పాటు నగర పౌరుల కృషి ఎంతో ఉందన్నారు. రాబోయే పండుగలను అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా పీస్ కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా మతపరమైన ఉద్రిక్తతలు రేకెత్తించేలా, ప్రజలను భయాందోళనకు గురిచేసేలా వచ్చే అసత్య ప్రచారాల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇలాంటి పుకార్లను నమ్మకుండా ప్రజలకు వాస్తవాలను వివరించడంలో సభ్యులు క్రియాశీలకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రస్తుత తరుణంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల సామాన్య ప్రజలను చైతన్యపరచడంలో పీస్ కమిటీ సభ్యులు చొరవ చూపాలని కోరారు. అలాగే నగరంలో డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగాన్ని సమూలంగా అరికట్టడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు, పోలీసులకు మధ్య స్నేహపూర్వక బంధాన్ని బలోపేతం చేస్తూ, హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత సురక్షితమైన నగరంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించేందుకు ఇకపై మూడు నెలలకోసారి జోనల్ స్థాయిలో విధిగా పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో సభ్యులు ఇచ్చిన పలు సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ నిరభ్యంతరంగా తమకు సలహాలు ఇవ్వవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ఐపీఎస్, జాయింట్ సీపీలు డి. జోయల్ డేవిస్, ఐపీఎస్, ఎస్.ఎం. విజయ్ కుమార్, ఐపీఎస్, ఎన్. శ్వేత, ఐపీఎస్ తో పాటు పలు జోన్ల డీసీపీలు రక్షిత కృష్ణ మూర్తి, ఐపిఎస్, ఖరే కిరణ్ ప్రభాకర్, ఐపీఎస్, శిల్పవల్లి, ఐపీఎస్, ఎ. రమణా రెడ్డి, బి. రాజేష్, జి. చంద్ర మోహన్, ఎస్. శ్రీనివాస్, ట్రాఫిక్ డీసీపీలు రాహుల్ హెడ్గే ఐపిఎస్, కాజల్, ఐపిఎస్, అవినాశ్ కుమార్ ఐపిఎస్ లు పాల్గొన్నారు. అలాగే, సెంట్రల్ పీస్ & వెల్ఫేర్ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీకిషన్ శర్మ, వివిధ జోన్ల అధ్యక్షులు శశికాంత్ అగర్వాల్, ఖాజా అబ్దుల్ మోయిజ్, ఖాజా గాజియుద్దీన్, మహమ్మద్ మౌజం అలీ, తేజో విజయ కుమారి, శశి కాంత్ అగర్వాల్, ఎస్. నారాయణ రెడ్డి, ఆర్. ఉమేందర్ కుమార్, తదితరులు హాజరయ్యారు.

కాంగ్రెస్‌లో కొనసాగడంపై

# ఆలోచిస్తున్నా: జీవన్ రెడ్డి



కాంగ్రెస్ మెజార్టీ స్థానాలు కైవసం చేసుకున్నప్పటికీ.. ఛైర్మన్ పదవి ఎవరికి ఇస్తారన్న దానిపై ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ క్రమంలోనే జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ వర్గీయులు క్యాంప్ రాజకీయాలు చేశారు. చివరికి సంజయ్ వర్గానికి చెందిన వ్యక్తి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. దీంతో జీవన్‌రెడ్డి అసహనానికి గురైనట్లు సమాచారం. "ఈ ఎన్నిక ముగింపు కాదు. జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ ఉన్నంతకాలం నాకు వేధింపులు తప్పవు. పవర్ ఆఫ్ అటార్నీ ఎమ్మెల్యే సంజయ్‌కు రాసిచ్చారా? బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు జగిత్యాల కాంగ్రెస్ పట్టా రాసిచ్చారు. ఎమ్మెల్యే పార్టీ మారలేదని స్పీకర్ అంటున్నారు. ఆయన మాత్రం కాంగ్రెస్ పార్టీతో సంసారం చేస్తున్నారు. కార్యకర్తల మనోభావాలను పార్టీ అధినాయకత్వం గౌరవించాలి. జగిత్యాలలోనే ఇలా ఉంటే.. పార్టీ మారిన మరో 9 ప్రాంతాల్లో ఎలా ఉందో..!" అని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# బేగంపేటలో భారీ చోరీ..

# 30 తులాల బంగారం అపహరణ



బేగంపేట శ్యామ్‌లాల్ వద్ద ఓ వృద్ధురాలు మూడో అంతస్తులో నివసిస్తున్నారు. ఆదివారం శివరాత్రి కావడంతో.. తన కుమార్తె ఇంటికి వెళ్లారు. ఉదయాన్నే తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటంతోపాటు బీరువాలో ఉన్న బంగారం, వెండి కనిపించలేదు. దీంతో వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు అక్కడి పరిస్థితిని పరిశీలించారు. గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

జనగామ పురపాలికలో..

# పురపీఠం ఉత్కంఠ

జనగామ మున్సిపాలిటీలో 30 వార్డులకు గానూ మిత్ర పక్షమైన సీపీఎం గెలుచుకున్న ఒక వార్డుతో కలిసి కాంగ్రెస్ కూటమికి 13 వార్డులు దక్కాయి. విపక్ష భారాస అంతే సమానంగా 13 వార్డులు గెలుచుకుంది. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, సిట్టింగ్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఓటు నమోదు చేసుకోవడంతో ఇరుపార్టీలు మళ్లీ చెరో 14 ఓట్లతో సమంగా ఉన్నాయి. దీంతో జనగామ ఛైర్మన్ పీఠం కైవసం చేసుకోవడంలో స్వతంత్రులే కీలకంగా మారారు. నలుగురు స్వతంత్రుల్లోనూ ఇరువైపులా ఇద్దరు వెళ్లినట్లు ప్రచారం జరగడంతో జనగామ పురపీఠం రాజకీయాలు ఉత్కంఠగా మారాయి.

# కిమ్ రాజ్యంలో 'అత్తాకోడళ్ల' పోరు తప్పదా..?

నిరంకుశ పాలనకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే కిమ్ రాజ్యంలో కుటుంబ పోరుకు తెర లేచిందా? అధికార పగ్గాల కోసం అత్తా కోడళ్లు పోటీ పడనున్నారా? ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే ఇలాంటి ప్రశ్నలే ఎదురవుతున్నాయి. ఉత్తరకొరియా (North Korea) అధినేత కిమ్ జోంగ్ ఉన్ తన వారసత్వ పగ్గాలను 13 ఏళ్ల తన కుమార్తె కిమ్ జు యేకు అప్పగించే అవకాశం ఉన్నట్లు ఇటీవల దక్షిణ కొరియా స్పై ఏజెన్సీ వెల్లడించింది. అదే జరిగితే కిమ్ (Kim Jong Un)కు తన సోదరి నుంచి సవాలు ఎదురయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**కుమార్తెకు పట్టం..**

కిమ్ జోంగ్ ఉన్ తన రాజకీయ వారసురాలిగా కుమార్తె కిమ్ జు యే(Kim Ju Ae)ను ప్రకటించే అవకాశాలున్నట్లు దక్షిణ కొరియా నిఘా సంస్థ నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్(ఎన్ఐఎస్) అంచనా వేసింది. ఈ నెలాఖరులో కిమ్‌కు చెందిన వర్కర్స్ పార్టీ సదస్సు జరగనుంది. ఇదే వేదికగా ఆయన తన వారసత్వ ప్రణాళికలకు పార్టీ పరంగా ఆమోదముద్ర వేసుకునే అవకాశం ఉందని తెలిపింది. 13 ఏళ్ల కిమ్ జు యే 2022లో తొలిసారిగా ప్రపంచానికి కనిపించింది. ఆ తర్వాత ఆయుధ పరీక్షల నుంచి మిలిటరీ పరేడ్‌ల వరకు పలు అధికారిక, కీలక కార్యక్రమాల్లో తండ్రి వెంట హాజరైంది. వాస్తవానికి ఉత్తరకొరియా పురుషాధిక్య నాయకత్వ క్రమాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఆమెకు వారసత్వ బాధ్యతలు అప్పగించే అవకాశాలు తక్కువనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కానీ, గతేడాది సెప్టెంబరులో కిమ్ జోంగ్ ఉన్‌తో కలిసి బీజింగ్ పర్యటనకు వెళ్లడంతో ప్రపంచం దృష్టి ఆమెపై పడింది. కిమ్ రాజకీయ వారసురాలు ఆమెనే అనే అంచనాలు నాటినుంచే బలపడ్డాయి.



**సోదరీ.. శక్తిమంతమైన నాయకురాలే**

అయితే, వారసత్వ పగ్గాల బదిలీ విషయంలో కిమ్ జోంగ్ ఉన్‌కు తన సోదరి కిమ్ యో జోంగ్ నుంచి ప్రతిఘటన ఎదురయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. 38 ఏళ్ల యో జోంగ్ ప్రస్తుతం దేశంలోనే రెండో అత్యంత శక్తిమంతమైన నాయకురాలిగా పేరొందారు. కొరియా వర్కర్స్ పార్టీ సెంట్రల్ కమిటీలో సీనియర్ హోదాలో ఆమె కొనసాగుతున్నారు. ఆమెకు దేశం లోపలా, వెలుపలా మంచి పాపులారిటీ ఉంది. సోదరుడి కిమ్ జోంగ్ ఉన్ పాలనపైనా ఆమె ప్రభావం చూపించగలరని చెబుతారు. 2022లో దక్షిణ కొరియా రక్షణమంత్రిని టార్గెట్ చేస్తూ కిమ్ యో జోంగ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. దక్షిణ కొరియా వినాశనం తప్పదంటూ ఆమె నాడు తీవ్రంగా బెదిరించారు. ఆ తర్వాత కూడా పలుమార్లు అమెరికా, జపాన్ వంటి దేశాలను హెచ్చరిస్తూ వార్తల్లో నిలిచారు. కిమ్ జోంగ్ ఉన్‌కు హఠాత్తుగా ఏమైనా జరిగితే అధికార బాధ్యతలు అందుకునేది అతని సోదరి అని గతంలో అంచనాలు వెలువడ్డాయి. రాజకీయంగానే గాక.. ఆమెకు మిలిటరీ మద్దతు కూడా ఉంది. అవకాశం వస్తే దేశ నాయకత్వ పగ్గాలను అందుకోవడానికి అన్ని విధాలా ఆమె సిద్ధంగా ఉన్నారంటూ దక్షిణ కొరియా ఇంటెలిజెన్స్ మాజీ అధికారి ఒకరు ఆ మధ్య అంచనా వేశారు.

**కిమ్ కుటుంబంలో 'రక్తచరిత్ర'..**

**కిమ్ కుటుంబంలో ఇలాంటి తగాదాలు కొత్తేం కాదు. రాజకీయంగా తన ఎదుగుదలకు అడ్డు అని భావించిన వారిని కిమ్ చాకచక్యంగా తప్పిస్తారనే ప్రచారం ఉంది. అధికారంలోకి వచ్చిన కొన్నేళ్ల తర్వాత 2013లో తన బంధువు, మెంటార్ అయిన జాంగ్ సోంగ్ థేక్‌కు మరణశిక్ష అమలు చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై కిమ్ ఈ చర్యలు తీసుకున్నట్లు నాడు వార్తలు వచ్చాయి. ఇక, కిమ్ సవతి సోదరుడు కిమ్ జోంగ్ నామ్ 2017లో మలేసియా ఎయిర్‌పోర్టులో హత్యకు గురయ్యారు. ఆ ఘటన వెనక కిమ్ హస్తం ఉందని ఆరోపణలు ఉన్నాయి.**

## మేఘా గ్రూప్‌లోకి జేడీ లక్ష్మీనారాయణ



మేఘా ఇంజినీరింగ్ గ్రూప్ సంస్థ ఈవీ ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా, మాజీ ఐపీఎస్ అధికారి వి.వి.లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. సీబీఐ జాయింట్ డైరెక్టర్‌గా చేసినప్పటి నుంచి జేడీ లక్ష్మీనారాయణగా ఆయన ప్రసిద్ధులు. 1990 మహారాష్ట్ర క్యాడర్ ఐపీఎస్ అధికారి అయిన లక్ష్మీనారాయణ విధుల్లో నిబద్ధతతో వ్యవహరిస్తూ, సంచలనాలకు కారణమయ్యారు. విద్యార్థిగా మెకానికల్ ఇంజినీరింగ్‌ను వరంగల్ ఎన్ఐటీలో, ఎంటెక్‌ను ఐఐటీ మద్రాస్‌లో ఆయన అభ్యసించారు. మేఘా గ్రూప్‌లోని విద్యుత్తు వాహనాల సమోదిత సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ అనుబంధ సంస్థే ఈవీ ట్రాన్స్. వివిధ రాష్ట్రాలకు ఒలెక్ట్రా సంస్థ గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జీసీసీ) పద్ధతిలో సరఫరా చేస్తున్న విద్యుత్తు బస్సులకు అవసరమైన ఛార్జింగ్ వ్యవస్థలు నిర్మించడంతో పాటు ఆయా బస్సుల నిర్వహణ బాధ్యతలన్నీ చూసేదే ఈవీ ట్రాన్స్. ప్రస్తుతం 900కు పైగా బస్సులను ఈ సంస్థ నిర్వహిస్తోంది.

## ఏఐ సదస్సులో జియో పెవిలియన్.. సందర్శించిన ప్రధాని మోదీ




దిల్లీలో 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు'లో భాగంగా ఏర్పాటు చేసిన జియో ఇంటెలిజెన్స్ పెవిలియన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ సందర్శించారు. అక్కడున్న వివిధ ఏఐ ఆధారిత నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంస్థ ఏఐ ఎకోసిస్టమ్, ఆయా రంగాల్లో డిజిటల్ మార్పులను వేగవంతం చేయడంలో దాని పాత్ర గురించి ప్రధాని మోదీకి జియో (Jio) ఛైర్మన్ ఆకాశ్ అంబానీ వివరించారు. జియో ఏఐ స్టాక్; జియో సంస్కృతి ఏఐ; జియో ఆరోగ్య ఏఐ; జియో శిక్ష; జియో ఏఐ హోం వంటి ప్లాట్‌ఫాంల లైవ్ డెమోలను ప్రధాని వీక్షించారు. ఆరోగ్యం, విద్య, వ్యాపార రంగాలను బలోపేతం చేసేందుకు, భారతీయ భాషలు, సాంస్కృతిక కంటెంట్‌ను ప్రోత్సహించేందుకు, ఏఐ ఆధారిత స్మార్ట్ లివింగ్‌ను పెంపొందించేందుకు వీటిని రూపొందించినట్లు ఆకాశ్ అంబానీ తెలిపారు. 'అందరికీ ఏఐ' అనే దార్శనికతను పునరుద్ఘాటిస్తూ.. అధునాతన సాంకేతికతలను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జియో సంస్థ తెలిపింది. తమ పెవిలియన్‌ను ప్రధాని సందర్శించడం.. దేశ ఏఐ రంగంలో విస్తరిస్తున్న ప్రైవేటు రంగం పాత్రను చాటిచెబుతోందని పేర్కొంది.

## రూ.1.28 లక్షల కోట్ల బంగారం మిస్సింగ్.. వాస్తవమిదీ..




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) ఖజానా నుంచి రూ.1.28 లక్షల కోట్ల విలువైన బంగారం మిస్ అయ్యిందంటూ ఓ పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ ప్రచారాన్ని పీఐబీ ఫ్యాక్ట్‌చెక్, ఆర్‌బీఐ ఖండించాయి. ఇలాంటి పోస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పౌరులకు సూచించాయి. ఇంతకీ ఏమైందంటే? ఫిబ్రవరి 6తో ముగిసిన వారానికి దేశంలోని బంగారం నిల్వలకు సంబంధించి ఆర్‌బీఐ డేటా వెలువరించింది. అంతర్జాతీయంగా బంగారం ధర ఇటీవల తగ్గడంతో ఆర్‌బీఐ దగ్గర ఉన్న పసిడి నిల్వల విలువ గణనీయంగా తగ్గినట్లు పేర్కొంది. ఈ డేటాను ఉటంకిస్తూ ఓ హిందీ దినపత్రిక వార్త ప్రచురించింది. అందులో రూ.1.28 లక్షల కోట్ల విలువైన బంగారం నిల్వలు మిస్సింగ్ అనే అర్థం వచ్చేలా వార్త ప్రచురించడం గందరగోళానికి దారితీసింది. దీంతో సామాజిక మాధ్యమాల్లో ఈ వార్తను ఉటంకిస్తూ కొన్ని పోస్టులు దర్శనమిచ్చాయి. ఈ నేపథ్యంలో పీఐబీ, ఆర్‌బీఐ అప్రమత్తమయ్యాయి. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నాయి. పసిడి విలువ తగ్గడం తప్ప.. భౌతిక బంగారంలో ఎలాంటి వ్యత్యాసమూ లేదని స్పష్టంచేశాయి. అధికారిక సమాచారం కోసం ఆర్‌బీఐ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించాయి.

## రైళ్లలో టాయిలెట్ల పరిశుభ్రతపై ఏ'ఐ'..!



రైల్వే ప్రయాణికులు ఎదుర్కొనే ప్రధాన సమస్యల్లో మరుగుదొడ్ల పరిశుభ్రత ఒకటి. రైల్వేకు వచ్చే ఫిర్యాదుల్లో సింహభాగం దీనిపై ఉంటాయనడంలో సందేహం లేదు. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు రైల్వే శాఖ సన్నాహాలు చేస్తోంది. రిజర్వ్ బోగీలతో పాటు జనరల్ బోగీల్లోనూ ప్రతి గంటకోసారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ ఇటీవల వెల్లడించారు. అంతేకాదు పరిశుభ్రతకు ఏఐ సాంకేతికనూ వినియోగించుకోనున్నారు. ఇందులో భాగంగా తొలి దశలో దేశవ్యాప్తంగా 100 రైళ్లలో పైలట్ ప్రాజెక్టుగా దీన్ని ప్రారంభించినట్లు చీఫ్ ప్రాజెక్టు ఇంజినీర్ లక్ష్మణ్ ఓ ఆంగ్లమీడియాకు తెలిపారు. ఏఐని ఎలా వినియోగించేదీ వివరించారు. రైళ్లలో పరిశుభ్రత కోసం ఉద్దేశించిన సిబ్బందికి ఒక మొబైల్ అప్లికేషన్ ఉంటుంది. వారు తమ హాజరును తొలుత అందులో నమోదు చేయాలి. ఆ తర్వాత రైళ్లలో క్లీనింగ్ ప్రారంభించే ముందు టాయిలెట్ ఫొటోను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. పరిశుభ్రత పూర్తయిన అనంతరం మరో ఫొటోను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ రెండు ఫొటోలను ఏఐ పరిశీలించి సేవల నాణ్యతను మదింపు చేస్తుంది. ఒకవేళ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా టాయిలెట్ల పరిశుభ్రత లేకుంటే సిబ్బందిని అప్రమత్తం చేస్తుంది. కొన్నిసార్లు జరిమానాలు వెయ్యడమో లేదా వేయాలని సూచించడమో చేస్తుంది. తద్వారా పారదర్శకతకు పెద్దపీట వేయాలని రైల్వే శాఖ భావిస్తోంది.

## ఏఐ కోడ్‌రాస్తుంటే.. మరి ఇంజినీర్ల పనేంటి..? ఆంథ్రోపిక్ ఏమందంటే..?




కృత్రిమ మేధ యుగంలో కొద్దిరోజులుగా ఆంథ్రోపిక్ పేరు ట్రెండింగ్‌లో ఉంది. ఈ ఏఐ స్టార్టప్ నుంచి వచ్చిన క్లాడ్ ప్లగిన్‌లు టెక్ ప్రపంచంలో ప్రకంపనలు సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. తమ ఏఐ మోడల్స్ 100శాతం కోడ్‌ను రాస్తున్నాయని ఆ సంస్థ వెల్లడించింది. మరి ఇలాంటప్పుడు ఇంజినీర్ల పనేంటి..? అని ఓ నెటిజన్ వేసిన ప్రశ్నకు ఆంథ్రోపిక్‌కు చెందిన కోడింగ్ అసిస్టెంట్ క్లాడ్ కోడ్ చీఫ్ బోరిస్ చెర్నీ సమాధానం ఇచ్చారు. "కోడింగ్ అనేది ఉద్యోగంలో ఒక భాగం మాత్రమే. ఏఐ వ్యవస్థలకు సరైన ప్రాంప్ట్‌లు ఇవ్వడం, ఇతర బృందాలను సమన్వయం చేసుకోవడం, కస్టమర్లతో అనుసంధానం అవ్వడం, తర్వాత ఎలాంటి ఫీచర్‌ను తీసుకురావాలి..? అనే అంశాలపై రీసెర్చ్ చేయడం వంటి పనులు ఇంజినీర్లకు ఉన్నాయి. అయితే ఇంజినీరింగ్ అనేది మారుతోంది. ఆ మార్పులకు అనుగుణంగా ఉండే ఇంజినీర్లు మాకు కావాలి'' అని చెర్నీ వివరించారు. ఏఐ టూల్స్ కోడింగ్, డాక్యుమెంటేషన్ వంటి పనులు చేసినప్పటికీ.. ఇంజినీర్లు సమీక్షించి, ధ్రువీకరిస్తారని చెప్పారు. సిస్టమ్ డిజైన్, దీర్ఘకాలిక ప్రణాళికలో వారి అవసరం ఉందన్నారు. అమెరికా కంపెనీ ఆంథ్రోపిక్.. ఇటీవల 'క్లాడ్ కోవర్క్ ఏజెంట్'కు 11 ఓపెన్ సోర్స్ ప్లగిన్‌లను విడుదల చేసింది. లీగల్, సేల్స్, మార్కెటింగ్, డేటా అనాలిసిస్ వంటి రంగాల్లో ఆటోమేషన్ కోసం ఈ ప్లగిన్‌లు ఉపయోగపడనున్నాయి. ఫైనాన్స్, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, బయాలజీ రీసెర్చ్, కస్టమర్ సపోర్ట్ వంటి రంగాల్లోనూ ఈ టూల్స్ కీలకంగా పనిచేస్తాయని కంపెనీ ప్రకటనలో వెల్లడించింది. సాధారణంగా డాక్యుమెంట్ రివ్యూలు, డేటా అనాలిసిస్ వంటి పనులను మల్టీనేషనల్ కంపెనీలు.. భారత ఐటీ సర్వీస్ ప్రొవైడర్లకు ఔట్‌సోర్సింగ్ కింద అప్పజెప్తుంటాయి. ఇప్పుడు ఆంథ్రోపిక్ ఏఐ టూల్‌తో ఇవన్నీ ఆటోమేటిక్‌గా జరిగే అవకాశం ఉండటం భారత ఐటీ మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసిన సంగతి తెలిసిందే.

## ఫారం16, 26AS ఇక కనుమరుగు.. ఏప్రిల్ 1 నుంచి కొత్త పేర్లు




ఫారం16, 26ఏఎస్ వంటి పేర్లు వేతన జీవులకు సుపరిచితమే. ఏటా ఐటీ రిటర్నులు దాఖలు చేసేటప్పుడు ఈ ఫారాల పేర్లు ఎక్కువగా వినిపిస్తుంటాయి. ఇకపై ఈ పేర్లు కనుమరుగు కానున్నాయి. వీటి స్థానంలో కొత్త పేర్లు వాడకంలోకి రానున్నాయి. కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి ఈ మార్పులు అమల్లోకి రానున్నాయి. అదే రోజు నుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం, 2025 అమల్లోకి రానున్న నేపథ్యంలో ముసాయిదా నిబంధనల్లో ఈ మార్పులు ప్రతిపాదించారు. ఐటీ రిటర్నులు దాఖలు చేసేందుకు ఉద్యోగులకు ఫారం16ను ఉద్యోగి పనిచేస్తున్న సంస్థ జారీ చేస్తుంటుంది. వేతనంపై టీడీఎస్ రూపంలో ఎంత మినహాయించిందీ వంటి వివరాలు ఇందులో ఉంటాయి. కొత్త ఏడాదిలో దీన్ని ఫారం 130గా వ్యవహరించనున్నారు. వార్షిక ఆదాయ వివరాలు తెలియజేసే ఫారం 26 ఏఎస్‌ను ఇకపై ఫారం168గా వ్యవహరించనున్నారు. వీటితో పాటు ఫారం 16ఏ ఫారం 131; ఫారం 24క్యూ ఫారం 138; ఫారం 26క్యూ ఫారం 140; ఫారం 26క్యూ ఫారం 144గా మారనున్నాయి. కొత్త ఆదాయపు పన్ను అమల్లోకి వచ్చేంత వరకు ప్రస్తుతం వాడుకలో ఉన్న ఫారం16, 26ఏఎస్ వంటివి చెల్లుబాటు అవుతాయి. 2026 ఏప్రిల్ 1 నుంచి కొత్త ఫారాలు అమల్లోకి రానున్నాయి. ప్రస్తుతం ముసాయిదా నిబంధనలపై ప్రభుత్వం సలహాలు, సూచనలు స్వీకరిస్తోంది. ఈ ముసాయిదా నిబంధనలపై త్వరలో తుది నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. ఏళ్లుగా వాడుకలో ఉన్న ఫారాల పేర్లు మార్పు వల్ల ఆదిలో ఇబ్బందులు ఎదురైనా క్రమంగా పన్ను చెల్లింపుదారులకు అలవాటైపోతాయని నిపుణులు పేర్కొంటున్నారు.

## ఈ వారమూ బేర్‌మనక తప్పదా?

–స్టాక్ మార్కెట్ ఈ వారం
–సూచీల్లో ఒత్తిడి కొనసాగొచ్చు
–ఐటీ షేర్లలో ఊగిసలాటకు అవకాశం
–ఏఐ సదస్సు ప్రకటనలు కీలకం
–విశ్లేషకుల అంచనాలు




స్టాక్ మార్కెట్లలో నష్టాలు కొనసాగొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఏఐ టూల్స్ నుంచి ప్రమాదం పొంచి ఉందన్న భయాందోళనల మధ్య ఐటీ షేర్లలో ఊగిసలాటలు వెంటాడొచ్చు. లోహ షేర్లకు అంతర్జాతీయంగా ఒత్తిడి ఎదురవుతోంది. దేశీయంగా బ్యాంకింగ్, వాహన, వినియోగ రంగాల వైపు మదుపర్లు మొగ్గుచూపొచ్చు. అమెరికాభారత్ వాణిజ్య ఒప్పంద సానుకూలతలను, ఏఐ టూల్స్ భయాలు తుడిచిపెట్టినట్లయిందని సాంకేతిక నిపుణులు అంటున్నారు. దిల్లీలో మొదలయ్యే 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' ప్రకటనల కోసం ఎదురుచూస్తున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. నిఫ్టీ50కి 25,500 వద్ద నిరోధం ఎదురు కానుందని, 25,100 వద్ద మద్దతు లభించొచ్చని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే.. ఇటీవలి నష్టాల నేపథ్యంలో పుంజుకోవడానికి ముందు ఐటీ షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. ఏఐ సమ్మిట్‌లో ప్రకటనలూ ప్రభావితం చేయొచ్చు. ఐటీ సూచీ 30,900 స్థాయి దిగువకు వస్తే మధ్యకాలానికి ప్రతికూలతలు కనిపించొచ్చు. కమొడిటీ ధరల్లో ఊగిసలాటల ప్రభావం లోహ, గనుల కంపెనీల షేర్లలో కనిపించొచ్చు. చైనా కొత్త సంవత్సర సెలవుల ప్రభావంతో పారిశ్రామిక గిరాకీ తగ్గొచ్చు. అమెరికా ఫెడ్ పరపతి విధాన అనిశ్చితుల ప్రభావమూ లోహ ధరలపై కనిపించొచ్చు. నిఫ్టీ మెటల్ సూచీకి 11,730 11,540 వద్ద మద్దతు లభించొచ్చు. డిసెంబరు త్రైమాసిక ఫలితాల్లో అంచనాలకు మించి బలహీనతలను ప్రదర్శించడంతో, యంత్రపరికరాల షేర్లు ఒక శ్రేణిలో చలించొచ్చు. అయితే ప్రభుత్వం, ప్రైవేటు కంపెనీలు అధిక వ్యయాలు చేస్తాయన్న ఆశల వల్ల నష్టాలు పరిమితంగానే ఉండొచ్చు. నిఫ్టీ బ్యాంక్ సూచీ ఈ వారం స్థిరీకరణకు గురికావొచ్చు. చాలా తక్కువ శ్రేణిలో చలించొచ్చు. ప్రధాన బ్యాంకుల ఫలితాలు రావడంతో తాజా సంకేతాల కోసం మదుపర్లు ఎదురుచూస్తున్నారు. సిమెంటు షేర్లు ఈ వారం లాభాలందించొచ్చు. సీజనల్ గిరాకీ మెరుగవడం ఇందుకు నేపథ్యం. అల్ట్రాటెక్ సిమెంట్ సమీప కాలంలో రాణించొచ్చు. పెరుగుతున్న నిర్వహణ సామర్థ్యం వల్ల రామ్‌కో సిమెంట్స్ షేరుకు సానుకూలతలు రావచ్చు. టెలికాం కంపెనీల షేర్లు స్వల్పకాలంలో స్థిరంగా కొనసాగొచ్చు. ఈ రంగంలో బలమైన నిధులున్నందున, వాటిని కంపెనీలు వేటికి కేటాయిస్తాయన్నదానిపై మదుపర్లు దృష్టి సారించొచ్చు. జియో పబ్లిక్ ఇష్యూకు వస్తుండడం ఈ రంగానికి కలిసొచ్చే అంశం. బలహీన డిసెంబరు త్రైమాసిక ఫలితాల నడుమ, నిఫ్టీ ఫార్మా ఈ వారమూ స్థిరీకరణకే లోనుకావొచ్చు. ప్రస్తుతానికి ఔషధ ఎగుమతులపై అమెరికా టారిఫ్ నుంచి మినహాయింపు ఉన్నప్పటికీ.. స్పష్టత కోసం వాణిజ్య ఒప్పందం అధికారిక అమలు కోసం ఈ రంగం ఎదురుచూస్తోంది. అమెరికాభారత్ వాణిజ్య ఒప్పందం అనంతరం నిఫ్టీ ఆటో తన దిద్దుబాటు స్థిరీకరణ నుంచి బయటపడి, బులిష్ సెంటిమెంటు వైపు పయనిస్తోంది. అశోక్ లేలాండ్‌లో స్ట్రక్చరల్ అప్‌ట్రెండ్ కనిపిస్తోంది. బజాజ్ ఆటో, టాటా మోటార్స్ షేర్లనూ పరిశీలించొచ్చని చెబుతున్నారు. చమురుగ్యాస్ కంపెనీల షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. డెయిలీ చార్టుల్లో స్వల్పకాల బలహీనతలు కనిపిస్తుండడం ఇందుకు నేపథ్యం. నిఫ్టీ ఆయిల్‌గ్యాస్‌కు తక్షణ మద్దతు 11,850 వద్ద, కీలక నిరోధం 12,200 వద్ద కనిపిస్తోంది. ఎఫ్ఎమ్‌సీజీ షేర్లు నష్టాలను కొనసాగించొచ్చు. హెచ్‌యూఎల్ బలహీన ఆర్థిక ఫలితాలతో తాజా విక్రయాల ఒత్తిడి కనిపిస్తోంది. ఈ కంపెనీ నుంచి విభజనకు గురైన క్వాలిటీ వాల్స్ షేర్లు సోమవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు కానున్నాయి.

## ఐదేళ్లలో ఆ ఉద్యోగాలు కనుమరుగవుతాయి: వినోద్ ఖోస్లా



సాంకేతిక రంగంలో సంచలనాలు సృష్టిస్తోన్న కృత్రిమమేధ .. అన్ని రంగాల్లోకి శరవేగంగా విస్తరిస్తోంది. దీనివల్ల ఉద్యోగాలు పోతాయనే ఆందోళన ఎంతో కాలంగా వినిపిస్తోంది. ఇప్పుడు ఇదే మాటను మరో బిలియనీర్ వినోద్ ఖోస్లా ప్రస్తావించారు. ఏఐ టూల్స్ వల్ల రానున్న ఐదేళ్లలో ఐటీ సేవలు, బీపీఓలు దాదాపు కనుమరుగుకానున్నాయని అంచనా వేశారు. రానున్న 15 ఏళ్లలో నైపుణ్య ఆధారిత వృత్తులు తుడిచిపెట్టుకుపోతాయని హెచ్చరించారు. అయితే విద్య, వైద్య సంరక్షణను మాత్రం అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. భారత్‌లో 'ఏఐ ఇంపాక్ట్ సమిట్' (AI Summit 2026) ప్రారంభం కానున్న నేపథ్యంలో ఓ జాతీయ సంస్థతో మాట్లాడారు. "ఈ ఏఐ ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై భారీ ప్రభావాన్ని చూపించనుంది. ఆ ప్రభావం ఎక్కువగా ఉద్యోగాల పైనే. కార్మికుల స్థానంలో భర్తీ చేసే రోబోలకు చెల్లించే వ్యయం చాలా తక్కువగా ఉండనుంది. దాంతో ద్రవ్యోల్బణం తగ్గుతుందని నా అంచనా. అలాగే ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. రానున్న 15 నుంచి 20 ఏళ్లలో చాలావరకు సేవలు ఉచితం కూడా కావొచ్చు. విద్య, వైద్యం అందరికీ అందుబాటులోకి వస్తుంది. భవిష్యత్‌లో ప్రభుత్వాలు ఉద్యోగ కల్పనపై దృష్టిపెట్టడం, ఉద్యోగం కోసం చదవడం అనేవి సరైన ఆలోచన కాకపోవచ్చని నా అభిప్రాయం. ఎందుకంటే పలు వృత్తులను ఏఐనే మెరుగ్గా చేయగలదు. కాబట్టి.. ఏఐ, మనుషులు కలిసి పనిచేసే కాలం వస్తుందని భావిస్తున్నాను. ఇక భారత్ ఐటీ సేవల విషయంలో కాకుండా ఏఐ ఆధారిత ఉత్పత్తులను ఎగుమతి చేసే దేశంగా భారత్ అవతరిస్తుంది'' అని ఖోస్లా పేర్కొన్నారు. 1620 తేదీల్లో, దిల్లీలోని భారత్ మండపంలో ఏఐ ఇంపాక్ట్ సమిట్ జరగనుంది . వివిధ దేశాలు తమ ఏఐ అజెండాను నిర్వచించుకోనున్నాయి. మన ప్రతిభను ప్రదర్శించడం, డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలను విస్తరించడం, విస్తృతం అవుతున్న అంకుర సంస్థల పర్యావరణ వ్యవస్థను ప్రపంచానికి పరిచయం చేయడం ఈ సదస్సు ఉద్దేశం. ఈ నేపథ్యంలోనే వెంచర్ క్యాపిటలిస్ట్ ఖోస్లా తన అభిప్రాయాలు వ్యక్తంచేశారు.

## బ్యాంకింగ్ స్టాక్స్‌లో కొనుగోళ్లు.. రాణించిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాలతో ముగిశాయి. బ్యాంకింగ్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దీంతో రెండ్రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. ఉదయం 82,480.40 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైన సూచీ.. క్రమంగా కోలుకుని లాభాలబాట పట్టింది. చివరికి సెన్సెక్స్ 650 పాయింట్ల లాభంతో 83,277.15 వద్ద ముగియగా.. నిఫ్టీ 211.65 పాయింట్ల లాభంతో 25,682.75 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.66గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎన్టీపీసీ, ఐటీసీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 67.44 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5033 డాలర్లు వద్ద ట్రేడవుతోంది.

## నైస్...
## మీరా జాస్మిన్



తన రాబోయే చిత్రం ఎల్ 366(వర్కింగ్ టైటిల్)లో లవ్ లాజన్ అనే పోలీసు పాత్రలో కనిపించనున్నట్లు ఇటీవలే ప్రకటించారు మలయాళ అగ్ర నటుడు మోహన్‌లాల్. ఈ సినిమాకి తరుణ్ మూర్తి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో నటి మీరా జాస్మిన్ కీలక పాత్రలో నటిస్తుంది. ఇటీవల ఆమె పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం ఈ సినిమాలోని మీరా పాత్రని పరిచయం చేస్తూ.. ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని ఆవిష్కరించింది. ఈ పోస్టర్‌కు 'నైస్ ఈజ్ నైస్' అనే క్యాప్షన్‌ని జోడించింది. దీంతో ఆమె నైసీ అనే పాత్రలో నటిస్తున్నట్లు స్పష్టం చేసింది. గతేడాది మీరా.. మోహన్‌లాల్ 'హృదయపూర్వం' చిత్రంలో అతిథి పాత్రలో అలరించింది.

## ఏఐ పట్ల..
## అప్రమత్తత అవసరం!



నటులు ఏఐ(కృత్రిమ మేధ)ని బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని బాలీవుడ్ అగ్ర కథానాయకుడు అభిషేక్ బచ్చన్ అన్నారు. ఏఐ అనేక రంగాలను ప్రభావితం చేస్తుందని.. కానీ, దానిని అదుపు లేకుండా వాడటం పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఇటీవల ఓ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన ఏఐ గురించి మాట్లాడుతూ.. "ఏఐ నన్ను భయపెడుతుంది. అలానే అది ప్రతి నటుణ్ని భయపెట్టాలి. ఇది సృజనాత్మక రంగంలో చాలా విషయాలలో విప్లవాత్మక మార్పులు తీసుకురాబోతుంది. కానీ, దానిని బాధ్యతాయుతంగా ఉపయోగించుకోకపోతే అది నటులకు ప్రమాదం. ముఖ్యంగా తెరవెనుక యానిమేషన్, స్పెషల్ ఎఫెక్ట్స్ లాంటి వాటికి చాలా ప్రయోజనకరంగా ఉంటూనే పని గంటల్నీ తగ్గిస్తుంది. ఏఐ నుంచి వచ్చే కంటెంట్‌లో కొన్ని అద్భుతంగా ఉన్నప్పటికీ.. కొన్నిటిలో భావోద్వేగాల లోతు ఉండడం లేదు. అసంపూర్ణంగా అనిపిస్తుంది. ఏఐ ప్రభావం సినిమాలకే పరిమితం కాదు. వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను అర్థం చేసుకోవడానికి ఇంకా ప్రయత్నిస్తున్నాను. సినిమాల విషయానికొస్తే ఏఐ ల్యాండ్‌స్కేప్ గురించి పూర్తి అవగాహన లేదు. అది ప్రయోజనకరంగా ఉంటుందా లేదా అనే దానిపై నాకు సందేహం ఉంది. దాని గురించి తెలుసుకోవాలనుకుంటున్నాను"అని అన్నారు. అభిషేక్ తదుపరి షారుక్ ఖాన్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'కింగ్' చిత్రంలో కనిపించనున్నారు.



# నేనూ వాళ్ల బాటలోనే...!

సుహాస్ శివానీ నాగారం జంటగా నటించిన 'హే భగవాన్' చిత్రం పేరు మార్చుకుంది. సెన్సార్ బోర్డు సూచనల మేరకు ఈ టైటిల్‌ని 'హే బల్‌వంత్'గా మార్చినట్లు చిత్ర బృందం ప్రకటించింది. గోపీ అచ్చర తెరకెక్కించిన ఈ సినిమా ఈనెల 20న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకుంది కథానాయిక శివానీ నాగారం.

''అంబాజీ పేట మ్యారేజి బ్యాండు' తర్వాత సుహాస్‌తో నాకిది రెండో సినిమా. అందులో కథతో పాటు నా పాత్ర చాలా గాఢతతో నిండి ఉంటుంది. కానీ, ఈ సినిమా ఆద్యంతం వినోదాత్మకంగానే ఉంటుంది. నా పాత్ర అమాయకంగా కనిపిస్తూనే అందర్నీ నవ్విస్తుంటుంది. నేనెంతో ఎంజాయ్ చేస్తూ చేసిన పాత్రిది. ఇందులోని తండ్రీ కొడుకుల అనుబంధం అందరి మనసుల్ని హత్తుకుంటుంది. విరామ సన్నివేశాలు ప్రతి ఒక్కర్నీ ఆశ్చర్యపరిచేలా ఉంటాయి. సుహాస్ నాకు మంచి మిత్రుడు. ఈ సినిమాలో మా ఇద్దరి మధ్య వచ్చే సన్నివేశాల్ని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు. అలాగే సుహాస్ సుదర్శన్‌ల ట్రాక్‌తో పాటు వెన్నెల కిశోర్ పాత్ర కూడా చాలా నవ్విస్తుంది. దీంట్లో నరేశ్ చేసే ఫ్యామిలీ బిజినెస్ ఏంటన్నది తెరపై చూసి తెలుసుకోవాల్సిందే. దీనితో హ్యాట్రిక్ కొడతాననే నమ్మకముంది''. ''నేను నటిని అవ్వాలని ఎప్పుడూ అనుకోలేదు. కానీ, ఇంట్లో వాళ్ల ప్రోత్సాహంతో ఇక్కడికి రావడం.. లక్కీగా ఆరంభంలోనే మంచి సినిమాలు పడటం.. నాకు చక్కటి గుర్తింపు తెచ్చిపెట్టింది. నా దృష్టిలో సినిమా అంటే సినిమానే. కథ, పాత్ర నచ్చితేనే ఏదైనా ఒప్పుకుంటా. ఎందుకంటే నేను ఎలాంటి నేపథ్యం లేకుండా ఇక్కడి దాకా వచ్చా. ప్రేక్షకులిచ్చిన ఆ గుర్తింపును నిలుపుకోవడమే నాకు ముఖ్యం. నాకు వంద సినిమాలు చేయాలని లేదు. చేసినవి అయిదు చిత్రాలైనా మంచి కథలతోనే చేస్తాను. నాకు కథ నచ్చిందంటే కాంబినేషన్‌తో సంబంధం లేకుండా సినిమా ఒప్పుకుంటా''. ''ప్రస్తుతం నటులతో పాటు రచయితలు, దర్శకులు ఎక్కువయ్యారు. తెలుగమ్మాయిలకు ఎక్కువ అవకాశాలు వస్తున్నాయి. ఇప్పుడు ప్రేక్షకులు చిన్న పెద్ద సినిమాలని తేడాలు చూపించట్లేదు. కంటెంట్ బాగుందంటే చిన్న చిత్రాల్ని కూడా పెద్ద సినిమాలు చేసేస్తున్నారు. కెరీర్ ఆరంభంలో చాలా మంది నాతో వెంట వెంటనే సినిమాలు చేయకపోతే కనిపించకుండా పోతావని సలహాలిచ్చారు. కానీ, నేను సినిమాల పరంగా ఆచితూచే అడుగులేస్తున్నా. 'ఈ అమ్మాయి ఎప్పుడూ మంచి సినిమాలే చేస్తుంది' అనే మాట అందరి నోట వినాలని ఉంది. సాయిపల్లవి, నిత్యామేనన్ లాంటి వాళ్లంతా సెలక్టివ్‌గానే సినిమాలు చేస్తున్నారు. నేనూ వాళ్ల బాటలోనే ముందుకెళ్తా''.

''నటిగా నాకు అన్ని రకాల జానర్లు చేయాలని ఉంది. రొమాంటిక్ కామెడీ చిత్రాల్ని ఎక్కువ ఇష్టపడతా. నేను నటించిన సినిమాలు ఓటీటీలోకి రావడం వల్ల అన్ని భాషల నుంచి ఆఫర్లు వస్తున్నాయి. ప్రస్తుతం తమిళంలో రెండు సినిమాలు.. తెలుగులో రెండు చిత్రాలు చర్చల దశలో ఉన్నాయి. త్వరలోనే ఆ చిత్ర వివరాల్ని అధికారికంగా వెల్లడిస్తా''.



# అట్లూరి జీవితం నేటి తరానికో పాఠం



కష్టేఫలి అనే సూత్రానికి ప్రముఖ నిర్మాత అట్లూరి పూర్ణచంద్రరావు నిలువెత్తు నిదర్శనమని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. గేటు కీపరుగా జీవితాన్ని ప్రారంభించి, రూ.5తో సినిమా నిర్మాణంలోకి అడుగుపెట్టి, 9 భాషల్లో 87 సినిమాలు పూర్తి చేయడం, వాటిలో ఎక్కువ సినిమాలు చరిత్ర నెలకొల్పడం ఆయన దూరదృష్టి, నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. పూర్ణచంద్రరావు 90వ పుట్టిన రోజును పురస్కరించుకుని కర్ణాటకలోని మడికేరిలో "ఇగ్రీన్‌పార్క్ రిసార్ట్ అండ్ స్పా'లో ఇటీవల నిర్వహించిన వేడుకలో ఆయనను సత్కరించి మాట్లాడారు. పదేళ్ల కిందట ఇక్కడ భూమి కొని, దీన్ని రిసార్టుగా అట్లూరి అభివృద్ధి చేశారు. అట్లూరి ప్రస్థానం నేటి తరానికి ఒక పాఠమని పేర్కొన్నారు. సినిమాలను విజయాలతోనే కాకుండా, విలువలతో లెక్క వేసిన నిర్మాతగా, వ్యాపారాన్ని లాభాలతోనే కాకుండా లక్ష్యాలతో ముందుకు నడిపిన క్రాంతిదర్శి అని ప్రశంసించారు. సినీరంగంలో ఆదర్శనీయమైన విలువలను పాటించడం ఒక ఎత్తయితే, ఆ ప్రస్థానాన్ని ఎక్కడ పరిపూర్ణం చేయాలన్న విషయం బాగా తెలిసిన వ్యక్తిగా కీర్తించారు. నన్ను 'అంధా కానూన్' చిత్రంతో హిందీ సినిమాకి పరిచయం చేసిన వ్యక్తి పూర్ణచంద్రరావే. ఎంతో నిఖార్సైన మనిషి. వారు 120ఏళ్లు బతకాలని కోరుకుంటున్నా'' అన్నారు ప్రముఖ కథానాయకుడు రజనీకాంత్. వ్యాపారవేత్తగా ఉన్న తనను 1973లో సినిమాల్లోకి రావాలని అట్లూరి ఆహ్వానించి, తనకు పేరు కూడా పెట్టారని సీనియర్ నటుడు, నిర్మాత మురళీమోహన్ చెప్పారు. నిర్మాతలు దిల్ రాజు, కేఎస్ రామారావు తదితరులు తమకు పూర్ణచంద్రరావుతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మురళీమోహన్‌కు ఇటీవల పద్మశ్రీ ప్రకటించిన నేపథ్యంలో ఈ వేడుకలో ఆయన్ని పూర్ణచంద్రరావు సత్కరించారు.

## ఏఐ.. నిశ్శబ్దంగా సినిమా భాషని తిరగరాస్తోంది



చిత్రపరిశ్రమలో తదుపరి పెద్ద విభజన.. ఏఐ(కృత్రిమ మేధ)ని స్వీకరించేవారికి, వ్యతిరేకించేవారికి మధ్య ఉండదని, ఆ సాధనాలతో మేధో సంపత్తిని నిర్మించేవారికి, వాటిని ఉపయోగించేవారికి మధ్య ఉంటుందని అంటున్నారు హీరో రానా. తాజాగా ఆయన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొన్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ సమ్మిట్‌లో తొలి రోజు "ఏఐ వర్సెస్ క్రియేటివిటీ: స్కిల్లింగ్ ఫర్ ఇన్నోవేషన్ ఇన్ ది ఇంటెలీజెంట్ ఎకానమీ" అనే సెషన్‌లో భాగమైన రానా కృత్రిమ మేధ సినిమాలపై చూపుతున్న ప్రభావం గురించి మాట్లాడారు. "నిశ్శబ్దంగా సినిమా భాషను తిరగరాస్తోంది కృత్రిమ మేధ. గతంలో ఒక షాట్ పూర్తి చేయడానికి 3 నుంచి 5 రోజులు పట్టేది. కానీ ఇప్పుడు అది కేవలం రెండు నుంచి మూడు గంటలకు తగ్గింది. అంతేకాకుండా ఒక చిత్రనిర్మాత షూటింగ్ ప్రారంభం కాకముందే తన సినిమాను చూడవచ్చు. ఇది నటుల స్థానాన్ని కూడా భర్తీ చేయగలదు. కానీ కథ చెప్పడం, సందర్భాన్ని అర్థం చేసుకోవడం లాంటి కొన్ని ప్రధాన నైపుణ్యాలను ఏఐతో భర్తీ చేయలేమ"ని అన్నారు.


## సూపర్ డీలక్స్ తర్వాత
## పాకెట్ నావెల్



నలుగురు వ్యక్తుల జీవితాల్లోని సంఘటనలతో రూపొంది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న చిత్రం 'సూపర్ డీలక్స్'. విలక్షణ నటుడు విజయ్ సేతుపతి, దర్శకుడు త్యాగరాజన్ కుమార రాజా కలయికలో వచ్చిన విజయవంతమైన చిత్రమిది. ఇప్పుడీ హిట్ కాంబినేషన్‌లో ఏడేళ్ల తర్వాత మరో సినిమా రాబోతుంది. దీనికి 'పాకెట్ నావెల్' అనే పేరును ఖరారు చేశారు. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు విజయ్ సేతుపతి. ఈ చిత్రంలో రాజ్ బి.శెట్టి, మాళవిక మోహనన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణను ప్రారంభించినట్లు, త్వరలో మరిన్ని వివరాల్ని వెల్లడించనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

# 'జై హనుమాన్' సన్నాహాలు

'హను-మాన్' సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. ఇప్పుడాయన ఈ చిత్రానికి కొనసాగింపుగా 'జై హనుమాన్'ను పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. రిషబ్ శెట్టి టైటిల్ పాత్ర పోషిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఇది వచ్చే వారం హంపీలో లాంఛనంగా ప్రారంభం కానుందని సమాచారం. దీనికి ఈనెల 22వ తేదీని ముహూర్తంగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. రామాయణంతో ముడిపడిన ఈ మైథలాజికల్ యాక్షన్ చిత్రం కోసం ప్రశాంత్ ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రీ విజువలైజేషన్ పనులు పూర్తయినట్లు ప్రచారం జరుగుతోంది. సినిమా ప్రారంభం రోజునే దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించే అవకాశముంది.



# పెళ్లి పీటలెక్కనున్న ఇషాన్!



పట్నా: భారత స్టార్ ఆటగాడు ఇషాన్ కిషన్ త్వరలో పెళ్లి పీటలెక్కనున్నాడా? అంటే అవుననే అంటున్నాడు అతని తాత రామ్ అనుగ్రహ పాండే. మోడల్ అదితి హుండియాతో ఇషాన్ వివాహం జరగొచ్చని పాండే సూత్రప్రాయంగా చెప్పాడు. జైపుర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె అదితి. 2019 నుంచి ఇషాన్, అదితిల స్నేహం గురించి కథనాలు వస్తున్నాయి. ఐపీఎల్‌తో పాటు అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనూ ఆమె ఇషాన్‌ను ప్రోత్సహిస్తూ స్టేడియంలో తరచూ కనిపిస్తుంటుంది. ''తనకు ఇష్టమైన అమ్మాయిని ఇషాన్ పెళ్లి చేసుకోవచ్చు. మాకెలాంటి అభ్యంతరం లేదు. అదితి జైపుర్‌కు చెందిన మోడల్. మిస్ ఇండియా పోటీల్లో రన్నరప్‌గా నిలిచింది'' అని పాండే తెలిపాడు. బిహార్‌లోని ఔరంగాబాద్ జిల్లా దౌద్‌నగర్ బ్లాక్ పరిధిలోని గోడిహా గ్రామం ఇషాన్ కుటుంబం స్వస్థలం. ప్రస్తుతం ఇషాన్ కుటుంబం రాంచిలో స్థిరపడినా.. అతని తాత పాండే మాత్రం ఇప్పటికీ సొంత గ్రామంలోనే వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఇషాన్ తన వ్యక్తిగత విషయాలు, కెరీర్ గురించి చర్చిస్తుంటాడని పాండే చెప్పాడు. పాకిస్థాన్‌తో మ్యాచ్‌కు ముందు మనవడితో మాట్లాడినట్లు పాండే పేర్కొన్నాడు. అయితే ప్రస్తుతానికి ఇషాన్ వివాహం గురించి చర్చలేమీ లేవని అతని తల్లి సుచిత్ర సింగ్ పేర్కొనడం గమనార్హం.

# కోపం వదిలెయ్ సోదరా!



కొలంబో: పాకిస్థాన్‌తో ఆదివారం మ్యాచ్ అనంతరం భారత స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ చాలా కోపంగా కనిపించడం చర్చనీయాంశమైన సంగతి తెలిందే. హార్దిక్ బౌలింగ్‌లో క్యాచ్ వదిలేసినందుకు అతడితో పాటు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా కుల్‌దీప్‌పై అసహనం వ్యక్తం చేశాడు. మ్యాచ్ అనంతరం ఆటగాళ్లు పరస్పరం అభినందనలు తెలుపుకొనే సమయంలో సూర్య చేయి కలపబోగా, కుల్‌దీప్ విసురుగా వెళ్లిపోయాడు. దీంతో వారి మధ్య మున్ముందు సంబంధాలు ఎలా ఉంటాయో అని భారత అభిమానులు కంగారు పడ్డారు. అయితే మ్యాచ్‌లో జరిగిన విషయాలను మరిచిపోయి ఇద్దరూ కలిసిపోయారని అ రోజు సూర్య పంచుకున్న వీడియోతో స్పష్టమైంది. నిన్నటి దృశ్యాన్ని తలపించేలా కుల్‌దీప్‌తో కలిసి ఒక రీల్ చేశాడు సూర్య. మ్యాచ్‌లో లాగే సూర్య కౌగిలించుకోబోతే.. కుల్‌దీప్ విసురుగా వెళ్లిపోయాడ[ు. ఈ వీడియోకు 'కోపం తగ్గించుకో భాయ్' అనే వ్యాఖ్యను జోడించి సూర్య ఎక్స్ ఖాతాలో పోస్టు చేశాడు.

# పది పరీక్షలకు వైభవ్ దూరం



దిల్లీ: భారత అండర్ 19 ప్రపంచకప్ స్టార్.. రాజస్థాన్ రాయల్స్ యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ ఈ ఏడాది సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షలకు దూరంగా ఉండనున్నాడు. క్రికెట్ శిక్షణ, రాబోయే టోర్నీలపై పూర్తిగా దృష్టిసారించాలని భావిస్తున్న వైభవ్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. వైభవ్ పరీక్షలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు పాఠశాల యాజమాన్యం ధ్రువీకరించింది. ''ప్రస్తుతం వైభవ్ దృష్టంతా క్రికెట్‌పైనే ఉంది. అందుకే ఈనెల 17 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు అతను హాజరవడం లేదు. వచ్చే ఏడాది పదో తరగతి పరీక్షలు రాస్తాడు'' అని వైభవ్ తండ్రి సంజీవ్ సూర్యవంశీ తెలిపాడు. తండ్రితో చర్చించిన తర్వాతే పరీక్షలకు దూరమవ్వాలని వైభవ్ నిర్ణయించుకున్నాడని తాజ్‌పూర్‌లోని మోడెస్టరీ స్కూల్ డైరెక్టర్ ఎ.కె.పింటూ చెప్పాడు.

# కంగారూలు మళ్లీ పడ్డారు



లంకేయులు అదరహో.. కంగారూలకు మళ్లీ షాక్! శ్రీలంక వరుసగా మూడో విజయంతో టీ20 ప్రపంచకప్‌లో సూపర్ 8కు దూసుకెళ్లింది. జింబాబ్వే చేతిలో షాక్ తిన్న ఆస్ట్రేలియా.. లంక చేతిలోనూ ఓటమి పాలైంది. ఓపెనర్ నిశాంక (100 నాటౌట్; 52 బంతుల్లో 10×4, 5×6) అద్భుత శతకం సాధించిన వేళ.. గ్రూప్‌బి మ్యాచ్‌లో శ్రీలంక 8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తుగా ఓడించింది. సోమవారం మొదట ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటైంది. మిచెల్ మార్ష్ (54; 27 బంతుల్లో 8×4, 2×6), ట్రావిస్ హెడ్ (56; 29 బంతుల్లో 7×4, 3×6) చెలరేగారు. కంగారూలు చాలా పెద్ద స్కోరు చేయాల్సింది. కానీ శ్రీలంక బౌలర్లు అద్భుతంగా పుంజుకుని ఆ జట్టును కట్టడి చేశారు. హేమంత (3/37), చమీర (2/36), వెల్లలాగె (1/33) ఆసీస్‌ను దెబ్బతీశారు. నిశాంకతో పాటు కుశాల్ మెండిస్ (51; 38 బంతుల్లో 6×4, 1×6), రత్నాయకే (28 నాటౌట్; 15 బంతుల్లో 6×4) చెలరేగడంతో లక్ష్యాన్ని లంక 18 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. ఆసీస్ బౌలర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. నిశాంకకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియాకు ఇది రెండో ఓటమి. గత మ్యాచ్‌లో ఆ జట్టుకు జింబాబ్వే షాకిచ్చిన సంగతి తెలిసిందే. తాజా ఓటమితో ఆసీస్ సూపర్ 8 అవకాశాలు చాలా సంక్లిష్టమయ్యాయి. ఇప్పటికీ అవకాశాలు ఉన్నాయి. కానీ ఆ జట్టుకు సమీకరణాలు చాలా కలిసి రావాలి. ముందైతే మంగళవారం జరిగే మ్యాచ్‌లో ఐర్లాండ్ చేతిలో జింబాబ్వే ఓడిపోవాలి. ఆ మ్యాచ్‌లో జింబాబ్వే నెగ్గితే మాత్రం ఈ ప్రపంచకప్‌లో ఆసీస్ కథ ముగుస్తుంది. జింబాబ్వే ముందంజ వేస్తుంది.

దంచేశారు..: శ్రీలంక ఛేదనలో ఓపెనర్ నిశాంకే హీరో. అతడు ఒంటి చేత్తో తన జట్టును విజయతీరాలకు చేర్చాడు. విధ్వంసక విన్యాసాలతో లంక అభిమానులను ఉర్రూతలూగించాడు. రెండో ఓవర్లోనే మరో ఓపెనర్ కుశాల్ పెరీరా (1)ను వెనక్కి పంపినా.. ఆసీస్‌కు ఆ ఆనందం ఎంతో సేపు నిలువలేదు. నిశాంక విరుచుకుపడ్డాడు. చకచకా బౌండరీలు బాదేశాడు. కుశాల్ మెండిస్ కూడా చెలరేగడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. కుశాల్ 35 బంతుల్లో, నిశాంక 32 బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేశారు. అయితే 13వ ఓవర్లో కుశాల్ నిష్క్రమించడంతో 97 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అప్పటికి లంక స్కోరు 105. అక్కడి నుంచి నిశాంక మరింత రెచ్చిపోయాడు. రత్నాయకే కూడా అలవోకగా బ్యాట్ ఝుళిపించడంతో లంక వడివడిగా లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. బౌండరీల వరద పారుతుంటే ఆసీస్ బౌలర్లు నిస్సహాయులుగా మిగిలిపోయారు. ఎలిస్ ఓవర్లో రెండు సిక్స్‌లు బాదిన నిశాంక.. వెంటనే జంపా బౌలింగ్‌లో రెండు ఫోర్లు బాదేశాడు. ఓ సింగిల్‌తో శతకం పూర్తి చేశాడు. అర్ధశతకం నుంచి సెంచరీకి చేరుకోవడానికి అతడు 20 బంతులే ఆడడం విశేషం. రత్నాయకే బౌండరీతో శ్రీలంక లక్ష్యాన్ని అందుకుంది.

హెడ్, మార్ష్ మెరిసినా..: అంతకుముందు ఓ అద్భుత ఆరంభాన్ని ఆస్ట్రేలియా వృథా చేసుకుంది. భారీ స్కోరు చేసే అవకాశాన్ని చేజార్చుకుంది. 8.2 ఓవర్లలోనే 104/0తో కొండంత స్కోరు చేసేలా కనిపించిన ఆసీస్.. చివరికి 181తో సరిపెట్టుకోవడం ఏమాత్రం ఊహించనిదే. ఆస్ట్రేలియా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగగా.. ఓపెనర్లు మార్ష్, ట్రావిస్ హెడ్‌లు లంక బౌలింగ్‌ను ఉతికేశారు. పోటీపడి బౌండరీలు బాదేస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. కళ్లు చెదిరే సిక్స్‌లూ దంచారు. మార్ష్ రెండు ఫోర్లు, హెడ్ ఓ సిక్స్ కొట్టడంతో ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే చమీర 16 పరుగులు సమర్పించుకున్నాడు. తీక్షణ ఓవర్లో మార్ష్ వరుసగా 4, 4, 4, 4, 4 దంచేయడం విశేషం. హేమంత ఓవర్లో హెడ్ వరుసగా 6, 4 సాధించాడు. 8 ఓవర్లకే ఆసీస్ స్కోరు 97/0. ఓపెనర్ల జోరు చూస్తుంటే ఆస్ట్రేలియా చాలా పెద్ద స్కోరే చేసేలా కనిపించింది. కానీ 9వ ఓవర్లో హెడ్‌ను హేమంత ఔట్ చేయడంతో ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. అక్కడి నుంచి శ్రీలంక బౌలర్లు పట్టుబిగించారు. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన ఆస్ట్రేలియా.. పరుగుల కోసం చెమటోడ్చింది. గ్రీన్ (3)ను వెల్లలాగే.. మార్ష్‌ను హేమంత వెనక్కి పంపారు. టిమ్ డేవిడ్ (6) ఇలా వచ్చి అలా వెళ్లాడు. అయితే ఇంగ్లిస్ (27; 22 బంతుల్లో 3×4), మ్యాక్స్‌వెల్ (22; 15 బంతుల్లో 1×4, 1×6) నిలబడడంతో 16 ఓవర్లలో 160/4తో ఆసీస్ ఇన్నింగ్స్ కుదుటపడింది. కానీ 21 పరుగులకే ఆఖరి ఆరు వికెట్లు కోల్పోయిన ఆసీస్ అనుకున్న దాని కన్నా తక్కువ స్కోరే చేసింది.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: మిచెల్ మార్ష్ ఎల్బీ (బి) హేమంత 54; ట్రావిస్ హెడ్ (సి) కమిందు (బి) హేమంత 56; గ్రీన్ (స్టంప్డ్) కుశాల్ మెండిస్ (బి) వెల్లలాగె 3; టిమ్ డేవిడ్ (సి) హేమంత (బి) కమిందు 6; ఇంగ్లిస్ (సి) వెల్లలాగె (బి) చమీర 27; మ్యాక్స్‌వెల్ (సి) నిశాంక (బి) హేమంత 22; స్టాయినిస్ (సి) తీక్షణ (బి) చమీర 4; కనోలీ (సి) పెరీరా (బి) తీక్షణ 3; బార్ట్‌లెట్ రనౌట్ 0; ఎలిస్ నాటౌట్ 0; జంపా రనౌట్ 1; ఎక్స్‌ట్రాలు 5

మొత్తం: (20 ఓవర్లలో ఆలౌట్) 181;

వికెట్ల పతనం: 1104, 2110, 3116, 4130, 5160, 6174, 7177, 8180, 8180, 9180;

బౌలింగ్: చమీర 40362; తీక్షణ 40371; పతిరన 0.4030; శానక 1.20160; హేమంత 40373; వెల్లలాగె 40331; కమిందు 20191

శ్రీలంక ఇన్నింగ్స్: నిశాంక నాటౌట్ 100; కుశాల్ పెరీరా (సి) ఎలిస్ (బి) స్టాయినిస్ 1; కుశాల్ మెండిస్ (సి) కనోలీ (బి) స్టాయినిస్ 51; రత్నాయకే నాటౌట్ 28; ఎక్స్‌ట్రాలు 4

మొత్తం: (18 ఓవర్లలో రెండు వికెట్లకు) 184;

వికెట్ల పతనం: 18, 2105;

బౌలింగ్: బార్ట్‌లెట్ 20220; స్టాయినిస్ 40462; ఎలిస్ 30320; కనోలీ 30270; జంపా 40410; మ్యాక్స్‌వెల్ 20160

# అక్కడ మెరుపుల్లేవ్

టీ20 అనగానే గుర్తొచ్చేది సిక్సర్లు, ఫోర్లే! ఎంత బాదితే అభిమానులకు అంత ఆనందం. ఈసారి టీ20 ప్రపంచకప్‌లో చాలా మ్యాచ్‌ల్లో బ్యాటర్లు అదరగొడుతున్నారు. సిక్సర్లతో హోరెత్తిస్తున్నారు. కానీ ఆ మైదానానికి వస్తే బ్యాట్‌లు మూగబోతున్నాయి. బంతులు గర్జిస్తున్నాయి. ఆ మైదానమే.. ప్రేమదాస. కొలంబోలోని ఈ వేదిక ఇప్పుడు బ్యాటర్లకు సవాల్ విసురుతోంది. తాజాగా భారత్‌పాకిస్థాన్ మధ్య జరిగిన మ్యాచే ఇందుకు ఉదాహరణ. పాక్ జట్టు ఆరుగురు స్పిన్నర్లను దింపితే.. భారత్ అయిదుగురితో వేయించింది. మొత్తంగా భారత్ ఇన్నింగ్స్‌లో పాక్ 18 ఓవర్లు స్లో బౌలర్లతోనే బౌలింగ్ చేయించింది.

ఉపఖండం అంటేనే బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌లు గుర్తుకొస్తాయి. మ్యాచ్ గడుస్తున్నకొద్దీ స్పిన్నర్లు ప్రభావం చూపిస్తారు. కానీ తొలి ఓవర్ నుంచే స్లో బౌలర్లు రంగంలోకి దిగుతున్నారంటేనే ప్రేమదాస పిచ్‌పై బంతి ఎలా నాట్యం చేస్తోందో అర్థం చేసుకోవచ్చు. బంతి బ్యాట్ మీదకు రాదు.. స్లాట్‌లో పడదు. భారీ షాట్లకు దొరకదు. సాంకేతికంగా బలంగా ఉండే బ్యాటర్లే ఇక్కడ నిలవగలుగుతారు. ఇప్పటి దాకా ఈ స్టేడియంలో నాలుగు మ్యాచ్‌లు జరిగితే ఒక్కసారి మాత్రమే స్కోరు 180 పరుగులు దాటింది. అది కూడా ఐర్లాండ్‌పై ఆస్ట్రేలియా కొట్టింది. అదే ఆస్ట్రేలియా.. జింబాబ్వే చేతిలో కంగుతిన్న మైదానం కూడా ఇదే. 170 ఛేదించలేక కంగారూ జట్టు 146 పరుగులకే చేతులెత్తేసింది. ఐర్లాండ్ కూడా శ్రీలంకకు గట్టిపోటీ ఇచ్చింది. ఒత్తిడికి తలొగ్గి ఓడిపోయింది.



ఇక భారత్‌పాకిస్థాన్‌తో మ్యాచ్ గురించి ప్రత్యేకించి చెప్పుకోవాలి. బంతి ఎలా పడి ఎలా తిరుగుందో అర్థం కాని పరిస్థితుల్లో బ్యాటర్లు అయోమయానికి గురయ్యారు.

తొలి ఓవర్లోనే భారత్ అభిషేక్ శర్మ వికెట్ కోల్పోయి ఆత్మరక్షణలో పడింది. కానీ ఇషాన్ కిషన్ రూపంలో తెగించి భిన్నమైన షాట్లు ఆడే బ్యాటర్ ఉండడంతో టీమ్ఇండియాకు కలిసొచ్చింది. ఇషాన్ ఔటయ్యాక.. మిగిలిన భారత బ్యాటర్లు చాలా కష్టపడ్డారు. సూర్య, శివమ్ దూబె లాంటి దూకుడుగా ఆడే బ్యాటర్లు క్రీజులో ఉన్నా.. ఇషాన్ మాదిరిగా బ్యాట్ ఝుళిపించలేకపోయారు. బంతిని వీలైనంత నెమ్మదిగా వదులుతూ పాక్ బౌలర్లు.. భారత బ్యాటర్లకు కళ్లెం వేశారు. ఆ తర్వాత పాక్‌ను భారత బౌలర్లు క్రీజులో నాట్యం ఆడించారు. ఏమాత్రం కుదురుకోనీయని విధంగా బంతులు వేశారు. ఫుల్ లెంగ్త్‌లో కాకుండా.. బ్యాక్ ఆఫ్ లెంగ్త్ బంతులతో పాక్ బ్యాటర్లకు పరీక్ష పెట్టారు. బంతి పడకుండానే షాట్లు ఆడదామని ప్రయత్నించిన ప్రత్యర్థి బ్యాటర్లు పెవిలియన్ చేరక తప్పలేదు. ఇక్కడ జరిగిన గత నాలుగు మ్యాచ్‌ల్లో మొదట బ్యాటింగ్ చేసిన జట్టే విజయాన్ని సాధించింది. టీ20ల్లో 160లోపు స్కోర్లు సాధించినా.. కాపాడుకోగలగడం మామూలు విషయం కాదు. కానీ ప్రేమదాస పిచ్‌పై ఇలాంటి స్కోర్లే పెద్ద స్కోర్లనడానికి ఇప్పటిదాకా జరిగిన మ్యాచ్‌లే నిదర్శనం. ఇకపై ప్రేమదాస స్టేడియంలో జరిగే మ్యాచ్‌లు ఎలా సాగుతాయోనన్న ఆసక్తి రేగుతోంది. గురువారం శ్రీలంకజింబాబ్వే లీగ్ మ్యాచ్‌తో పాటు మూడు సూపర్ 8 సమరాలకు ప్రేమదాస ఆతిథ్యం ఇవ్వనుంది.

# అజ్మతుల్లా ఆల్‌రౌండ్ ప్రదర్శన


దిల్లీ: చిన్న జట్లలోకెల్లా బలమైన జట్టే అయినా, అదృష్టం కలిసిరాక తొలి రెండు మ్యాచ్‌ల్లో బోణీ కొట్టలేకపోయిన అఫ్గానిస్థాన్.. టీ20 ప్రపంచకప్‌లో తొలి విజయాన్ని సాధించింది. అజ్మతుల్లా ఒమర్‌జాయ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన చేయడంతో సోమవారం గ్రూప్ డి మ్యాచ్‌లో ఆ జట్టు 5 వికెట్ల తేడాతో యూఏఈని ఓడించింది. మొదట యూఏఈ 9 వికెట్లకు 160 పరుగులు చేసింది. సోహైబ్ ఖాన్ (68; 48 బంతుల్లో 6×4, 4×6), అలీషన్ షరాఫు (40; 31 బంతుల్లో 3×4, 2×6) రాణించారు. అఫ్గాన్ బౌలర్లలో అజ్మతుల్లా (4/15) అదరగొట్టాడు. ముజీబ్ రెహ్మాన్ (2/31), రషీద్ ఖాన్ (1/24) కూడా రాణించారు. ఇబ్రహీం జద్రాన్ (53; 41 బంతుల్లో 6×4, 1×6), అజ్మతుల్లా (40 నాటౌట్; 21 బంతుల్లో 2×4, 3×6) మెరుపులతో అఫ్గాన్ 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఈ గెలుపుతో అఫ్గాన్ సూపర్ 8 చేరే అవకాశాలను అఫ్గాన్ (2 పాయింట్లు) సజీవంగా ఉంచుకుంది. అయినా ఆ జట్టు ముందంజ వేయడం కష్టమే. అఫ్గాన్ సూపర్ 8కు చేరాలంటే ఆ జట్టు కెనడాపై ఘనంగా నెగ్గడమే కాక.. కెనడా చేతిలో న్యూజిలాండ్ (4 పాయింట్లు) ఓడిపోవాలి. ఈ గ్రూప్ నుంచి దక్షిణాఫ్రికా (6 పాయింట్లు) సూపర్ 8కు అర్హత సాధించింది.

ఇబ్రహీం, అజ్మతుల్లా మెరుపులు: ఛేదనలో అఫ్గాన్‌కు శుభారంభం దక్కలేదు. దక్షిణాఫ్రికాపై అదరగొట్టిన రహ్మానుల్లా గుర్బాజ్ (0) ఇన్నింగ్స్ రెండో బంతికే ఔటైపోయాడు. ఈ స్థితిలో ఇబ్రహీం జద్రాన్ నిలిచాడు. హైదర్ అలీ వేసిన నాలుగో ఓవర్లో ఇబ్రహీం 3 ఫోర్లు, ఓ సిక్స్ కొట్టడంతో 18 పరుగులు లభించాయి. దీంతో అఫ్గాన్ 5 ఓవర్లకు 39/1తో నిలిచింది. గుల్బదిన్ నైబ్ (13), సెదికుల్లా (16) స్వల్ప వ్యవధిలో ఔట్ కావడంతో అఫ్గాన్ ఒత్తిడిలో పడింది. ఈ స్థితిలో డార్విష్ రసూలి (33; 23 బంతుల్లో 3×4, 1×6) అండతో ఇబ్రహీం స్కోరును ముందుకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో అతడు 37 బంతుల్లో అర్ధసెంచరీ అందుకున్నాడు. 42 బంతుల్లో 64 పరుగులు చేయాల్సిన స్థితిలో ఇబ్రహీం ఔటైనా.. రసూలి, అజ్మతుల్లా ధాటిగా ఆడారు. ముఖ్యంగా అజ్మతుల్లా భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. చివరి 3 ఓవర్లలో 28 పరుగులు అవసరం కాగా.. రసూలి ఔట్ కావడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. కానీ అజ్మతుల్లా ఎదురుదాడిని ఆపలేదు. 19వ ఓవర్ చివరి రెండు బంతులకు 6, 4 కొట్టి అఫ్గాన్‌ను విజయానికి చేరువ చేసిన అతడు.. తర్వాతి ఓవర్లో మరో బౌండరీతో జట్టును గెలిపించాడు. అంతకుముందు సోహైబ్ ఖాన్ సత్తా చాటడంతో యూఏఈ పోరాడే స్కోరు చేయగలిగింది. 13 పరుగులకే రెండు వికెట్లు చేజార్చుకున్న ఆ జట్టును సోహైబ్, అలీషన్ షరాఫు ఆదుకున్నారు. ఒక దశలో 11.1 ఓవర్లకు 97/2తో యూఏఈ మెరుగైన స్థితిలో నిలిచింది. అయితే 24 పరుగుల తేడాతో 4 వికెట్లు చేజార్చుకున్న ఆ జట్టు భారీ స్కోరు చేసే అవకాశాలను కోల్పోయింది. సయ్యద్ హైదర్ (13), హైదర్ అలీ (13) కొన్ని షాట్లు ఆడడంతో స్కోరు 160కి చేరుకుంది.

సంక్షిప్త స్కోర్లు...

యూఏఈ: 160/9 (సోహైబ్ ఖాన్ 68, అలీషన్ షరాఫు 40, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 4/15, ముజీబ్ 2/31, రషీద్ 1/24);

అఫ్గానిస్థాన్: 19.2 ఓవర్లలో 162/5 (ఇబ్రహీం



జద్రాన్ 53, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 40 నాటౌట్, రసూలి 33)